ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 17 సంచిక : 03 నవంబర్ 2011

**రమణ భాస్కర**

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V.
సత్యవతి (హైమ)

**చందా**
సంవత్సర చందా:రు॥150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
**రమణ భాస్కర**
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు ~ 534 265
☎ 08814 - 224747
9247104551

**ఈ సంచికలో....**

జిన్నూరు ......... 27-07-2011
జిన్నూరు ......... 21-08-2011
జిన్నూరు ......... 02-10-2011

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## "హితోపదేశము" గ్రంథ సమీక్ష

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణల "గ్రంథాల మణిహారం"లో "ఉన్నది బ్రహ్మమొక్కటే" మరియు "హితోపదేశము" చేరి మరింత శోభను ఇచ్చాయి. ఈ గ్రంథాల సంపాదకులు శ్రీయుతులు జె.యస్.వి. ప్రసాద్‌గారు, కె.వి. రమణగార్లు సుందరంగా తీర్చిదిద్దటంలో పూర్తిగా సఫలురయ్యారు అని తెలుపడానికి ప్రమాణం వారు ఎన్నుకొన్న అంశం సర్వోన్నతమైనది, విశిష్టమైనది కావడం. గ్రంథం సమగ్రంగా, సంగ్రహంగా ఉపమానాలతో హితవుగా ఉంది. చెప్పటానికి చాలా కష్టపడి చెప్పే విషయాలు (ఆత్మగురించి) చెప్పటం అపూర్వమైనది. దాన్ని శ్రీ నాన్నగారు అనుభూతిని ఆలంబనగా చేసుకొని నిగూఢమైనది, అతిక్లిష్టమైనది, సునిశితమైనదాన్ని సందేహాలకు తావులేకుండా తేలిక పదాలతో, ప్రస్ఫుటంగా, విమర్శలకు తావులేకుండా తేనెలొలికే తేట తెలుగులో విశదం చెయ్యటానికి శ్రీనాన్నగారికే సాధ్యమౌతుంది. అందుకనే శ్రీరమణులు వారిని స్వప్నంలో ముద్దులతో మురిపించి ఆశీర్వదించారు. ఇంగ్లాండ్‌లో ఒక సభలో శ్రీనాన్నగారిని రోజర్ పరిచయ వాక్యాలు పలుకుతూ "భగవాన్ బిడ్డ, భగవాన్ సందేశాన్ని తెలపటానికి వచ్చారు" అన్నారు. శ్రీ నాన్నగారు "నేను ఏ ప్రేరణతో మాట్లాడుతున్నానో మీకు తెలియటంలేదు" అన్నారు. ఆ నోటిని ఈశ్వరుడు వినియోగించు కుంటున్నాడు అంతే. అంతకు మించి మనకు ఏమీ తెలియదు.

సంపాదకులు ప్రశ్నలు సంధించటంలో వినయం, విజ్ఞత తొణికిసలాడే వారి హృదయ ప్రతిభా పాటవాన్ని తెలుపుతున్నది. దానికి శ్రీనాన్నగారు సందేహాలకు అతీతంగా, విశాలహృదయంతో పాఠకుల హితవును కోరి ప్రేమతో కరుణతో, దయతో చేసిన హితోపదేశము సునిశితబుద్ధి, నిర్మలకుశాగ్రబుద్ధి గల సాధకులు పరవశించి, పులకరించి

హృదయంలో ఆ భావాలను ముద్రించుకొని లోచూపును పురిగొల్పుతుందని భావించటంలో అతిసయం ఏమాత్రం లేదని గ్రహింస్తారు. సందేహం కంటిలో నలుసువంటిది. అది తొలగితేగాని శాంతిలేదు పురోగతిలేదు. సాధకుడు పరిపరివిధాలుగా ఆలోచించి పరితపించి తర్కించుకొన్నా పరస్పరం విరుద్ధంగా ఉండే మాటలకు సమాధానం దొరకని అంశాలకు ఉదాహరణకు "నేను భూతముల యందులేను, నాలో భూతములు లేవు" అన్న అంశం లాంటివి కోకొల్లలుగా శాస్త్రాలలో ఉంటాయి. వాటిని సమన్వయంచేసే నేర్పు-కూర్పు అవి అత్యంత క్లిష్టమైన విషయాలను వివరించుట, ఆ మర్మాలను విశదం చెయ్యటం అనుభూతి ఆలంబనంగా చేసుకొని తెలపాలి. స్పష్టత ఉన్నచోట సమాధానపడటం ఉంటుంది. ఇది శంకరుల "పరి ప్రశ్న" మరియు అష్టావక్రగీతకు "ఓషో"ను సాధకుడు అడిగిన ప్రశ్నలకు సమాధానము ఇచ్చిన గ్రంథం చదివిన వారికి ఈ గ్రంథరాజం గుర్తుకు వస్తుంది. అనుభూతి పొందిన మాటలే అనుభూతినిస్తాయి.

శ్రీనాన్నగారు "అరచేతిలోని వస్తువును ఎలా చూడగలమో అలాగే నేను విషయాన్ని మీకు తెలుపకపోతే నాలో పవిత్రత లేనట్లే" అన్నారు. శంకరుల వాణి శ్రీనాన్నగారి తేటతెల్లమైన వారి వైఖరీవాణిలో చూపించారు. వారు తమ అనుభవాన్ని, దృష్టాంతరాలను, యుక్తిని, శాస్త్రప్రమాణాలను వాసుదేవ, శ్రీరమణుల, జీసెస్ వారి ప్రమాణాలను తెలుపుతూ మరియు విషయం ప్రయోజనం, సంబంధం, అధికారి ఎలా అవుతాడో అనే సాధనా చతుష్టయాన్ని తెలిపినతీరు అపూర్వం. విషయం ఒక్కటే అది కాలమాన పరిస్థితులను బట్టి ఉదాహరణలు మారుతాయి అనటంలోని నగ్నసత్యాన్ని శ్రీనాన్నగారు ఋజువుచేసారు. శ్రీనాన్నగారిని భక్తులు పరవశించి ఎందుకు చూస్తారు అంటే ఒక విదేశీయుడు "మిమ్ములను మీరు చూచుకుంటే ఎంత ఆనందమో వారి రూపాన్ని చూడటం అంతే ఆనందం" అన్నారు. ఈ గ్రంథం ముఖచిత్రం భగవత్ తత్వానికి సంకేతమైన నీలి వర్ణఆవరణలో, సత్వగుణానికి సంకేతమైన ధవళకాంతి వస్త్రధారణలో పింగళి సూర్య సుందరంగారి సుందర, సుమధురమైన శ్రీనాన్నగారిలో రాశీభూతకళ్యాణగుణాల వర్ణనలో ఆలోచనామృతాన్ని మనలో రేకెత్తించే శ్రీనాన్నగారి ముఖారవిందాన్ని చూచి ప్రతీ అంశం చదివి ఇది సత్యం - సత్యం - సత్యం అని అసూయతలేని పాఠకుల కళ్లకు ఈ చిత్రం కనువిందు చేస్తుంది. ఈ గ్రంథాలు రెండూ ఆధ్యాత్మిక సాధకుల ప్రతీ ఇంటా ఉంటే ఎంతో ఉపయుక్తమైనవి అని నా నిండు మనస్సుతో భావిస్తున్నాను. సంపాదకుల కృషి అజరామరమైనది. కారణం వారు ఐఎయస్ అనే భావాన్ని ప్రక్కనపెట్టి కేవలం భక్తులుగా వినయంగా భాషకందని భావాలను, మనస్సును ద్రవించే విషయాలను పాఠకులకు అందించారు. మాటలు గాలిలో కలిసిపోతాయి రచనకు స్థిరత్వం ఎక్కువ ఉంటుంది. వారికి శ్రీరమణులు, శ్రీనాన్నగారి ఆశీస్సులు నిండుగా ఉన్నాయని వారికి నా నమస్సులు తెలియజేస్తున్నాను.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం**

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 27-07-2011, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవద్గీతను 5000 సంవత్సరాలకి పూర్వం పరమాత్మ చెప్పాడు. కానీ భగవద్గీత ప్రచారంలో లేదు. ఆదిశంకరాచార్యులవారు వచ్చాక భగవద్గీతని ప్రచారం చేసారు. మీరు భగవద్గీతని బాగా చదివి అధ్యయనం చేసి అర్థం చేసుకుంటే మీకు అభ్యాసం చెయ్యాలనే బుద్ధి కలుగుతుంది. అభ్యాసం కూడా ఒక యోగం. మీరు అర్థం చేసుకున్నది అభ్యాసం చేస్తే అప్పుడు మీకు డైరెక్టుగా అనుభవంలోనికి వస్తుంది.

**లభన్తే బ్రహ్మనిర్వాణ మృషయః క్షీణకల్మషాః,**

**ఛిన్నద్వైధా యతాత్మానః సర్వభూత హితేరతాః (5-25)**

ఎవడు బ్రహ్మనిర్వాణము పొందుతాడు, ఎవడు బ్రాహ్మీస్థితిని పొందుతాడు అంటే క్షీణ కల్మషాః అంటే పాపమును పోగొట్టుకొనినవాడు. నీ జీవితం కృత్రిమంగా ఉండకూడదు. నీ జీవితం సరళంగా, సహజంగా ఉంటే కల్మషం నశిస్తుంది. నువ్వు చెయ్యవలసిన సాధన ఏమిటి అంటే నీలోఉన్న పరమాత్మని కనిపెట్టటంకాదు. ఇప్పుడు మనం ఆరోగ్యంగా ఉన్నాము, ఏదో రోగం వస్తుంది. ఆ రోగం తగ్గినతరువాత ఆరోగం లేనప్పుడు ఎలా ఉన్నామో మళ్ళీ ఆ స్థితికి వచ్చేస్తాము. అలాగే నువ్వు కల్మషం లేనప్పుడు ఏ సహజస్థితిలో ఉన్నావో నీలో ఉన్న కల్మషం పోగొట్టుకున్నాక అదే సహజస్థితిలోకి నువ్వు వచ్చేస్తావు అందుచేత నువ్వు సాధన చేసి, అభ్యాసము చేసి, వివేకము పెంచుకొని నీలో ఉన్న కల్మషాన్ని పోగొట్టుకో అన్నాడు పరమాత్మ. ఇతరుల్ని అంచనావేయుటంలో వివేకం ఉండాలి. నిన్ను నువ్వు తెలుసుకోవటానికి జ్ఞానం కావాలి. భవిష్యత్తులో డబ్బు ఉన్నాకాని తెలివితేటలు లేనివాడు ఈ భూమి మీద బతకలేడు. మీ పిల్లలకి డబ్బు సంపాదించి ఇచ్చి వాళ్ళకి మీరు తెలివితేటలు నేర్పకపోతే వాళ్ళు పాడైపోతారు. ఒకపని ఒకడు స్వార్థంతోటి చేస్తూఉంటే పతనమవుతాడు వాడికి పునర్జన్మలు పెరుగుతాయి. అదే పనిని నువ్వు స్వార్థరహితంగా కనుక చేస్తే నువ్వు ఆధ్యాత్మికంగా, నైతికంగా అభివృద్ధిలోనికి వస్తావు. నువ్వు చేసే కర్మే నీ అభివృద్ధికి కారణం, నీ పతనానికీ కారణం. ఛిన్నద్వైధాః అంటే సంశయములు లేనివారు. కొంతమందికి ప్రతీదానికి సంశయం. మేము దేవుడు ఉన్నాడు అని చెబుతాము అనుకోండి ఏదో నాన్నగారు చెప్పారు అసలు దేవుడు ఉన్నాడో, లేడో, బహుశా దేవుడు లేడేమో అనుకుంటారు. మీకు ఆరోగ్యం బావుంది అనుకోండి, రోజులు బాగా వెళ్ళిపోతున్నాయి అనుకోండి, అందరూ మిమ్మల్ని అమ్మగారు, అయ్యగారు

అంటున్నారు అనుకోండి అసలు ఏదొక రోజున మనకి చావు వస్తుంది అనే సంగతి కూడా మీరు మరిచిపోతారు. మాయ అంత బలీయమైనది. అటువంటప్పుడు మీరు దేవుడిని మరచిపోవటంలో ఆశ్చర్యమేముంది. మీకు సంశయం పనికిరాదు. మీకు జిన్నూరులో ఉన్న 7000 మంది వచ్చి భగవంతుడు లేడని చెప్పినా మీకు ఉన్న విశ్వాసం చలించకూడదు. అప్పుడు భగవంతుడి అనుగ్రహం మీకు వస్తుంది. మనకి ఆత్మవిశ్వాసం లేనప్పుడు ఇతరులు ఏది చెబితే అదే నిజం అనుకుంటాము. నువ్వు చేసే సాధన మీద నీకు నమ్మకం లేనప్పుడు, మానసికంగా బలహీనుడు అయినవాడికే భగవంతుడు ఉన్నాడా, లేడా అని అనుమానం వస్తూ ఉంటుంది. ఇంతవరకూ ఈ సృష్టిలో ఏ బలహీనుడికీ ఆత్మజ్ఞానం రాలేదు అన్నాడు పరమాత్మ. మీకు సందేహాలు ఉంటే అలా పెట్టుకుని ఉండకండి. సందేహం కాలులో ముల్లులాంటిది, కంటిలో నలుసులాంటిది. కంటిలో నలుసు ఉంటే ఎంత బాధపెడుతుందో, కాలిలో ముల్లుకూడా అంతే బాధపెడుతుంది. నీకు ఏమైనా సందేహాలు, సంశయాలు ఉంటే అవి పోగొట్టుకోవటానికి గురువుని ఆశ్రయించి వినయంగా, విధేయతతోటి, తెలుసుకోవాలనే కాంక్షతోటి అడిగితే అప్పుడు గురువుకి దయకలిగి చెబుతాడు. మీరు అడిగే విధానం ఎలా ఉండాలి అంటే గురువుకి చెప్పాలనే బుద్ధి కలిగేలా ఉండాలి. అప్పుడు కాని గురువు కూడా చెప్పడు. అందుచేత భగవంతుడిపట్ల మీకు ఏమైనా సందేహాలు ఉంటే గురువుని అడిగి ఆ సందేహాలను తొలగించుకోండి.

రమణమహర్షిగారిని ఒకరు అడిగారు మనకి ఎడమవైపున ఫిజికల్ హార్ట్ ఉంటుంది, కుడివైపున స్పిరిట్యువల్ హార్ట్ ఉంటుందని మీరు చెబుతున్నారు, మరి మాకు ఎడమవైపు బీటింగు తెలుస్తోందికదా, మరి కుడివైపున స్పిరిట్యువల్ హార్ట్ ఉంటే అది మాకు ఎందుకు తెలియటం లేదు అని అడిగారు. అది అనుభవం వలన మీకు తెలుస్తుంది. స్పిరిట్యువల్ హార్ట్ అది శరీరంలో ఒక భాగంకాదు, అలాగని అది లేదనికాదు, అది వట్టిమాటలతోటి తెలియబడదు. అది ఎక్స్‌పీరియన్స్‌వలన మీకు తెలుస్తుంది. మనం చేస్తున్న సాధనతోపాటు గురువుఅనుగ్రహం ఉండాలి. శాస్త్రం యొక్క అనుగ్రహం ఉండాలి. మీరు మంచి వాళ్లమని అనుకుంటే అది తెలియబడదు. మీరు ఉత్తములు అని లోపలఉన్న సద్వస్తువు అనుకోవాలి అప్పుడు ఆ సద్వస్తువు తెలియబడుతుంది. నీలోపలఉన్న సద్వస్తువు గోడలాంటిది కాదు, అది జడవస్తువు కాదు. అది నీ ఆలోచనలకి, నీ తలంపులకి, నువ్వు చేసే పనులకీ సాక్షిగా ఉంటుంది. అందుచేత జడ్జిమెంట్ అది చెప్పాలికాని నేను ఉత్తముడిని, మంచివాడిని అని

నీవు అనుకుంటే అనుకో కాని నీకు సహృదయం ఉంది, నీకు సద్బుద్ధి ఉంది, నీ జీవితం అంతా గాడ్‌సెంటర్డ్ అని అది అనుకున్నప్పుడు నీకు ఆ సద్వస్తువు తెలియబడుతుంది కాని నువ్వు అనుకుంటే అది తెలియదు. మీకు అది తెలియబడాలంటే మీలో కల్మషం పోవాలి, వ్యక్తిభావనపోవాలి, మనోగతమైన నేనులోంచి మీరు విడుదలపొందాలి, లేకపోతే ఆ సద్వస్తువు మీకు తెలియబడదు. మీరు శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని జీవించాలికాని, ఈ దేహగతమైన నేనుని ప్రమాణంగా పెట్టుకొని జీవించకూడదు. నువ్వు ఏదైతే నేను, నేను అనుకుంటున్నావో అది నిజంకాదు. నీ హృదయంలో ఒక నిజం ఉంది. హృదయంలో ఉన్న నిజం నీకు అనుభవంలోనికి రావాలి. మన హృదయంలో ఒక నిజం ఉందని కూడా మనకు అర్థం అవ్వటంలేదు. సత్‌పురుషులు, మహాత్ములు, మహర్షులు, యోగులు, అవతారపురుషుల యొక్క సహవాసం వలన హృదయంలో ఒక నిజం ఉందని నీకు తెలియబడుతుంది. మీకు ఆ రుచి తెలిసాక అభ్యాసం చెయ్యాలి అనిపిస్తుంది. భగవంతుడు ఉన్నాడు అనే విశ్వాసం, నమ్మకం మనం వదిలిపెట్టకూడదు.

రామకృష్ణపరమహంస శరీరం వదిలిపెట్టినతరువాత కొంతమంది శిష్యులు చెదిరి పోయారు. వాళ్ల ఇంటి దగ్గర వాళ్ళు మీరు వివేకానంద జతలు పట్టవద్దు అనేవారు. ఆ శిష్యులు మంచివాళ్లే. ఆ ఇంట్లోవాళ్ళు దారి తప్పించేసారు. నరేంద్రుడు ఆ చెదిరిపోయిన పిల్లల ఇంటికి వెళ్లేవాడు. నరేంద్రుడిని చూచి వీడు మన పిల్లల్ని పాడుచేస్తున్నాడు అని వాడు దూరంగా ఉండగానే తలుపులు వేసేసుకునేవారు. వాళ్ళు బయట కనిపించినప్పుడు నరేంద్రుడు చెప్పేవాడు. మీ తల్లిదండ్రులు మిమ్మల్ని పెళ్లి చేసుకోమంటున్నారు దానికి ఏమీ తప్పలేదు, మీరు చదువుకున్నారు కాబట్టి ఉద్యోగాలు చేసుకొని మిమ్మల్ని డబ్బు సంపాదించుకో మంటున్నారు సంసారపక్షంగా అది తప్పని నేను చెప్పటం లేదు. కానీ మన గురువు బ్రతికి ఉండగా ఏమి చెప్పాడో అదే మీరు గుర్తుపెట్టుకోండి. మీరు పెళ్లి చేసుకుంటే పెళ్లి అబద్ధం, మీరు చదివిన చదువులు అబద్ధం, మీరు డబ్బు సంపాదించుకుంటే మీ డబ్బు అబద్ధం. ప్రపంచంలో ఏదైనా ఒక నిజము అంటూ ఉంటే మన గురుదేవుడు రామకృష్ణుడు ఏ స్థితిని పొందాడో అది ఒక్కటి మాత్రమే నిజం. మిగతావి ఏవీ నిజంకాదు, అన్నీ అబద్ధాలే. దానినిబట్టి మీరు ఆలోచించుకోండి అని చెప్పి వెళ్లేవాడు. నరేంద్రుడు గురువుపట్ల ఎంత విశ్వాసపాత్రుడు అయితే అలా మాట్లాడగలడు. వాడికి సందేహాలు ఉంటే ఆ మాట చెప్పలేడు కదా. నరేంద్రుడు మన ఇండియా వాడు అయినా ప్రాపంచిక పౌరుడు. ఇండియాని ఎంత ప్రేమించాడో

ప్రపంచాన్ని కూడా అంతే ప్రేమించాడు. నరేంద్రుడు బీదవాళ్లని మరింతగా ప్రేమించాడు. అన్నం తినటానికి కంచం దగ్గర కూర్చుంటే ఎవరైనా బీదవాడు కనిపిస్తే నరేంద్రుడు అన్నం మానేసి వాడికి పెట్టేసేవాడు.

యతాత్మానః అంటే ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం కలవారు. మీకు అన్ని భోగాలు అందుబాటులో ఉండాలి, ఆ భోగాలమీద మీ మనస్సు వాలకూడదు, అప్పుడు వాడు నిగ్రహం కలవాడు అని కాళిదాసు చెప్పాడు. మీకు జున్ను అంటే ఇష్టం అనుకోండి. మీరు మాకు జున్ను ఇష్టంలేదు అంటారు అనుకోండి, జున్ను ఎదురుగుండా పెడితే తినేస్తారు. మనం నక్కల్లా తయారు అయ్యాం. ఎలాగంటే నక్కలకు ద్రాక్షపళ్ళు అందలేదు కాబట్టి ద్రాక్షపళ్ళు పుల్లన అంటాయి. ద్రాక్షపళ్ళు అందితే నక్కలు తినేస్తాయి. మీకు జున్ను ఎలాగ దొరకదు కాబట్టి ఇష్టం లేదు అంటున్నారు. దొరికితే తినేస్తారు. అలాగ మిమ్మల్ని మీరు మోసం చేసుకోవద్దు. అన్ని భోగాలు మీకు ఎదురుగుండా ఉన్నప్పటికీ మనస్సు చలించకూడదు అది యతాత్మానః.

సర్వభూతహితేరతాః అంటే సర్వప్రాణుల యొక్క హితవుకోరుట. నువ్వు అందరికీ సహాయం చేయలేకపోవచ్చు. అందరూ క్షేమంగా ఉండాలని నువ్వు కోరుకో. నీకు ఇంటి దగ్గర దారిద్ర్యం ఉన్నా నీ హృదయంలో దారిద్ర్యం పనికిరాదు. అందుచేత నువ్వు ఇతరుల క్షేమం కోరుకోవటంలో మటుకు నువ్వు దరిద్రుడిగా ఉండకు. మీ శత్రువుల క్షేమం కూడా కోరుకో. శత్రువులు, స్నేహితులు, బంధువులు వీళ్లందరూ మనోకల్పితాలే. మొత్తం అంతా నీ మైండు క్రియేషన్. స్వప్నంలో జరిగేది ఎంత అసత్యమో ఇది కూడా అంతే అసత్యం.

పాపమును పోగొట్టుకొనినవాడు, సంశయములు లేనివాడు, ఇంద్రియ మనోనిగ్రహము కలవాడు, సమస్త ప్రాణుల యొక్క హితము కోరువాడు ఈ క్వాలిఫికేషన్స్ ఉన్నవాడు బ్రహ్మముతో ఒకటి అయిపోతాడు. అట్టివాడు మాత్రమే మోక్షాన్ని పొందగలడు. చాలా విషయాలలో మనల్ని మనం మోసం చేసుకుంటున్నాము. మనం దేహాత్మబుద్ధి పెట్టుకొని బ్రహ్మాత్మబుద్ధి ఉంది అనుకుంటున్నాము, ఆత్మకి చావులేదు అని భగవంతుడు చెబుతున్నాడు. దేహం చనిపోయినప్పుడు మనం చనిపోతున్నాము అని అనుకుంటున్నాము. అంటే మనకి దేహబుద్ధి ఉంది కాని ఆత్మబుద్ధి లేదు. ఆత్మబుద్ధి ఉన్నవాడు దేహం చనిపోయి నప్పుడు నేను చనిపోతున్నాను అని అనుకోడు. మనం ఎల్‌కెజి చదువుతూ పిజిలో ఉన్నాం

అనుకుంటే ఎలాగ? అది ఆత్మవంచన అంటున్నారు. ఇప్పుడు నీకు దేహాత్మబుద్ధే ఉంది కాని నువ్వు బ్రహ్మాత్మ బుద్ధి ఉంది అనుకుంటే నష్టపోతావు. ఇలా నిన్ను నువ్వు మోసం చేసుకోవద్దు.

**కామక్రోధ వియుక్తానాం యతీనాం యతచేతసామ్**

**అభితో బ్రహ్మ నిర్వాణం వర్తతే విదితాత్మనామ్ (5-26)**

కామక్రోధాలు అన్నా రాగద్వేషాలు అన్నా ఒక్కటే. ఎక్కడైతే కామం ఉంటుందో అక్కడ రాగం ఉంటుంది. ఎక్కడైతే కోపం ఉందో అక్కడ ద్వేషం ఉంటుంది. మీరు ప్రపంచంలో ఏ దేశం వెళ్ళి చూచినా, ఏ ప్రాంతం వెళ్ళిచూచినా, ఎవరింటికి వెళ్ళి చూచినా రాగద్వేషాలు తప్పించి ఏముంది ఈ సృష్టిలో చూడటానికి అన్నాడు బుద్ధుడు. కామక్రోధాలు యొక్క వేగం తట్టుకోవటం కష్టం. రాగద్వేషాలు ఉన్నవాడి మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. కామక్రోధాల్లోంచి మీరు విడుదల పొందకుండా స్వరూపసుఖాన్ని పొందలేరు. సాధనచేసి, సాధనచేసి రాగద్వేషాలని అతిక్రమించినవాడుకాని హృదయగుహలో పడలేడు, అంటే స్వరూపసుఖం పొందలేడు. స్వరూపసుఖం అంటే నూటికినూరుపాళ్ళు మీరు హేపీగా ఉంటారు. మీ డబ్బులను బట్టి, మీ పాండిత్యాన్ని బట్టి, మీ కుటుంబపరిస్థితులను బట్టి ఆ హేపీనెస్ రాదు. మీ కుటుంబపరిస్థితులు అనుకూలంగా ఉండవచ్చు, ప్రతికూలంగా ఉండవచ్చు, మీ ఇంట్లో వాళ్ళు అందరూ మీకు శత్రువులు అవ్వవచ్చు కానీ ఈ రాగద్వేషాలు దాటినవాడు, ఈ కామక్రోధాల్లోంచి విడుదల పొందినవాడు నూటికినూరుపాళ్ళు అలౌకికమైన, అభౌతికమైన స్వతంత్రమైన సుఖం, ముగింపులేని శాంతిని పొందుతాడు. మీరు కనీసం మీ ముక్కులో గాలి బయటకి పోయేటైముకి అయినా ఆ సుఖాన్ని మీరు ఎక్స్‌పీరియన్స్ చేస్తే మీకు పునర్జన్మ లేదు, మీరు శవాలని మొయ్యనక్కరలేదు అని గౌతమబుద్ధుడు స్పెసిఫిక్‌గా అనుభవం మీద చెప్పాడు.

యతీనాం యతచేతసామ్ అంటే మనస్సు స్వాధీనమందు ఉండుట. అజ్ఞానంలోంచి విడుదలపొందటానికి ఎవరైతే ప్రయత్నం చేస్తున్నారో, ఎవరైతే తమని తాము స్వాధీనం చేసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నారో వారు శరీరం బతికిఉండటంతోటి, శరీరం చనిపోవటం తోటి సంబంధం లేకుండా అమృతత్వం పొందుతారు. మృత్యువు అంటే చనిపోవటం, అమృతత్వం అంటే మృత్యువుని జయించిన వాళ్ళని అమృతత్వం పొందారు అంటారు. మరణం అంటే కంగారుపడకండి. మరణం అంటే ఏమీ లేదు. ఈ శరీరం పనికిరాదు అని భగవంతుడు అనుకున్నప్పుడు శరీరాల్ని మారుస్తాడు. మరణం మనకి మంచిదే. ఒకో శరీరంలో మనం

ఎంత ప్రయత్నం చేసినా ఎక్కువ సాధన చేయలేము. కాని సాధన చెయ్యాలనే కుతూహలం ఉంటుంది. ఆ కుటుంబపరిస్థితులను బట్టి, ఆ పరిసరాలను బట్టి సాధన ఎదరకు వెళ్లదు. వాడు ఎంత కష్టపడ్డ అభివృద్ధిలోకి రాలేడు. అటువంటప్పుడు ఆధ్యాత్మిక అభివృద్ధిరావటానికి దేహాన్ని మార్చేస్తాడు. అప్పుడు కుటుంబం మారిపోతుంది, పరిసరాలు మారిపోతాయి, ఊరు మారిపోతుంది. అప్పుడు వాడికి మంచిదేకాని చెడ్డకాదు. కానీ అది మనకి తెలియకపోవటం వలన కంగారు వచ్చేస్తుంది. అది భగవంతుడి గ్రేస్. భగవంతుడు మీకు ఏదైనా ఉపకారం చేస్తే దేవుని దయవలన ఇలా ఉన్నాము అనుకుంటున్నారు. అలాగే చావు వచ్చినా దేవుని దయ అనుకోండి. ఆయన దయలేకపోతే శరీరం మార్చడు. మీ మీద కోపం మీద కాదు. మీకు ఆధ్యాత్మిక పురోభివృద్ధి కలగటం కోసం అలా చేస్తాడు. అనేక జన్మలు సత్‌కర్మ నిష్కామంగా చేస్తేనే కాని, అనేక జన్మల పుణ్యబలం ఉంటేకాని, ఆ జన్మకాజన్మ పవిత్రుడు అయితేనేగాని వాడు ఆత్మజ్ఞానానికి అర్హుడు కాడు.

అభితో బ్రహ్మనిర్వాణం వర్తతే విధితాత్మానామ్ అంటే అమృతత్వం పొందినవాళ్లకి, బ్రహ్మానుభవం పొందినవాళ్లకి శరీరం చనిపోనక్కరలేదు. మీ శరీరం ఈ భూమి మీద తిరుగుతున్నప్పుడే మీరు బ్రాహ్మీసుఖం పొందుతారు. రమణ మహర్షి, రామకృష్ణ పరమహంస ఆకాశంలోంచి ఊడిపడ్డారా? వారు మనలాంటి మనుషులే. సాధన చేసి, సాధన చేసి కష్టపడి, కష్టపడి ఆ దైవత్వం పొందారు. మీరు కూడా ప్రయత్నం చేసి పొందండి. దానికి అందరూ వారసులే. వాళ్ల హృదయంలో ఉన్నదే మీ హృదయంలో ఉంది. వాళ్ళు తెలుసుకున్నారు, మనం తెలుసుకోలేకపోతున్నాము. వాళ్ళు ఎంత కష్టపడి ప్రయత్నం చేసారో మనం కూడా అంత కష్టపడి సాధన చేస్తే మనం తెలుసుకుంటాము. నమ్మినవాడిది సొమ్ము, నమ్మనివాడిది దుమ్ము.

**యోగయుక్తో విశుద్ధాత్మా విజితాత్మా జితేన్ద్రియః**
**సర్వభూతాత్మ భూతాత్మా కుర్వన్నపి నలిప్యతే (5-7)**

యోగయుక్తుడు అంటే కర్మని యోగంగా చేసేవాడు. కర్మని యోగంగా చేస్తే నువ్వు చేసే పని నిన్ను బంధించదు, వాసనలలో నుండి విడుదల చేస్తుంది. కర్మయోగం వలన కూడా జ్ఞానం సంపాదించవచ్చు. బుద్ధిమంతుడు ఏమి చేస్తాడు అంటే తెరమీద వాడు కనపడడు, వాడి పని కనిపిస్తూ ఉంటుంది. ఇప్పడు మనం ఎలా ఉన్నాము అంటే మనుషులు కనపడాలి, పని ఉండకూడదు. విశుద్ధాత్మా అంటే పవిత్రమైన హృదయం కలవాడు. నిన్ను

నువ్వు పవిత్రం చేసుకోవటానికి ప్రయత్నం చెయ్యి. నీ బుద్ధిని శుద్ధి చేసుకో. యోగానికి మీ శరీరం ఆరోగ్యంగా ఉండాలి, మీ మనస్సు ఆరోగ్యంగా ఉండాలి. రోజూ ఒక అరగంటో, గంటో ఏకాంతంగా కూర్చోండి. మీరు ఏకాంతముగా కూర్చుంటే మీలో లోపాలు మీకు తెలుస్తూ ఉంటాయి. ఏకాంతవాసం స్కేనింగ్ లాంటిది. వర్కు కూడా స్కానింగ్ లాంటిదే. మీరు ఎవరినీ ఎటువంటి వాళ్ళు అని అడగకండి. వాడు రోజూ ఏదో పని చేసుకుంటాడు కదా, ఆ పని మీరు అబ్జర్వు చేయండి. పని వాడి స్వార్థంకోసం చేసుకుంటున్నాడా, వాడి అహంకారాన్ని గ్లోరీపై చేసుకోవటానికి చేసుకుంటున్నాడా? నిజంగా భగవంతుడి ప్రీతికోసం చేస్తున్నాడా అని వాడి పని చూస్తే మీకు తెలిసిపోతుంది. భగవంతుడి ప్రీతికోసం పనిచేస్తూ ఉంటే వాడి మనస్సు పవిత్రం అవుతుంది. నీ మనస్సు ప్రశాంతంగా ఉన్నప్పుడు నీ హృదయంలో ఏమి ఉందో నీకు ప్రతిబింబిస్తూ ఉంటుంది. నీ మనస్సు ప్రశాంతంగా ఉంటే, నీ ఇంద్రియాలు కుదురుగా ఉంటే నీ బుద్ధి ఉద్రేకం లేకుండా ఉంటే నీ లోపల నుంచి అనుగ్రహం ఉందని అప్పుడు దానిలైట్ నీకు తెలుస్తూ ఉంటుంది. పూర్వం ఎప్పుడైనా నీకు కష్టాలు వచ్చినా ఇవి మంచి తీసుకురావటానికే వచ్చాయి, నాలో పరివర్తన తీసుకురావటానికే వచ్చాయి అని నీకు స్పష్టంగా తెలుస్తుంది. అప్పుడు నువ్వు దేవుడిని తిట్టటం మానేస్తావు. మీరు ఎవరి కోసమైతే సంపాదిస్తున్నారో, ఎవరికోసమైతే బతుకుతున్నారో వాళ్ళచేత భగవంతుడు ఒకోసారి తిట్టిస్తాడు. ఎందుచేతనంటే వాళ్ళమీద మీకు మమకారం తగ్గించటానికి. ఎటాచ్‌మెంట్ ఉంటే మీరు పాపం చేయటం మానరు. ఎటాచ్‌మెంట్ మనచేత పాపం చేయిస్తుంది. మీరు దేవుడిని స్మరించుకోవటం మానేసి వాళ్ళని స్మరించుకుంటూ చస్తారు. నువ్వు బంధంలో ఉన్నావు. నిన్ను బంధరహితస్థితికి తీసుకువెళ్ళటానికి ఈశ్వరుడు ఒకడే ఆధారం. అందుచేత నీ పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా ఈశ్వరుడి పాదాలు ఎప్పుడూ విడిచిపెట్టకు. శ్వాసపోయే వరకూ విశ్వాసం విడిచిపెట్టకు.

బ్రహ్మభూతః ప్రసన్నాత్మానశోచతి నకాంక్షతి అంటే బ్రహ్మము వేరు నేనువేరు అనుకోకుండా బ్రహ్మముతోటి కలిసి ఉన్నవాడికి కోరిక లేదు, దుఃఖము లేదు. బ్రహ్మత్వం పొందినవాడి మనస్సు ఎక్కడా ఆధారపడదు. ఎందుచేతనంటే ఏ వస్తువునీ తనకంటే భిన్నంగా చూడడు, ఇంక దేనిని కోరుకుంటాడు. నువ్వు శరీరం ఎక్కడ ఉంటే అక్కడ ఉన్నాను అనుకుంటున్నావు. శరీరం చనిపోయినప్పుడు నేను చనిపోతున్నాను అనుకుంటున్నావు. నేను అనే తలంపు ఉన్నవాడు నాది అనుకోకుండా ఉండలేడు. నాది ఉన్నప్పుడు కోరిక

పుడుతుంది. ఇది నాది అనుకున్నప్పుడు అదిపోతే దుఃఖం వస్తుంది. అది నీది కాదు అనుకున్నప్పుడు అదిపోతే నీకు దుఃఖం రాదు. నువ్వు దేహం అనుకున్నప్పుడు నీకు ఇంకో దేహం వేరుగా కనిపిస్తుంది. ఆ వేరుభావన వచ్చినప్పడే నీకు కోరిక వస్తుంది, కోపము వస్తుంది, ఇష్టం వస్తుంది, అయిష్టం వస్తుంది మొత్తం అంతా వచ్చేస్తుంది. బ్రహ్మంకు వేరుభావన లేదు కాబట్టి వాడికి మోహము లేదు, వాడికి కోరిక వచ్చే అవకాశం లేదు, దుఃఖం వచ్చే అవకాశం లేదు. బ్రహ్మమును తెలుసుకున్నవాడు బ్రహ్మము అవ్వడు. బ్రహ్మ స్వరూపం పొందుతాడు. ఈశ్వరుడిని తెలుసుకుంటే ఈశ్వరుడు అవ్వరు ఈశ్వర స్వరూపం పొందుతారు.

సమస్సర్వేషు భూతేషు అంటే సర్వభూతాల పట్ల హెచ్చు, తగ్గులు లేకుండా సమభావం కలిగి ఉండు. నీ మనస్సులో హెచ్చుతగ్గులు ఉంటే ప్రాక్టీసు చేసి తగ్గించుకో. నిన్ను ఎవరైనా తిడితే వాళ్ళని శత్రువుగా చూడకు. వాళ్ళు ఏదైనా ఇబ్బంది పెడుతూ ఉంటే నీకు సహాయం చేయగల శక్తి ఉంటే చెయ్యి. కాని వాడి తిట్లు నువ్వు జ్ఞాపకం పెట్టుకోవద్దు. వాడి తిట్లు నువ్వు జ్ఞాపకం పెట్టుకున్నావంటే నువ్వు భూతకాలంలో జీవిస్తూ వర్తమానకాలాన్ని వదిలేశావు అని అర్థం. అందుచేత నువ్వు ఎక్కడా శత్రుత్వం పెట్టుకోవద్దు. దానివలన నీ మనస్సు పాడవుతుంది. వాళ్ళు మనకి అపకారం చేస్తున్నారు అంటే వారికి కొంచెం దూరంగా ఉండండి సరిపోతుంది కానీ వాళ్ళని ద్వేషించవద్దు. ద్వేషిస్తే మీ మనస్సు బాహ్యముఖానికి వెళ్ళిపోతుంది. అస్తమానూ వాడు చెడ్డవాడు, వాడు చెడ్డవాడు అంటే చివరికి నీకు చెడ్డతనం మిగులుతుంది. అలా మననం చెయ్యకు. వాడు చెడ్డవాడు అయితే వాడిని భగవంతుడు చూచుకుంటాడు. ప్రపంచం అన్నాక హెచ్చుతగ్గులు ఉంటాయి. ఈ సృష్టి నీదీకాదు, నాదీకాదు. భగవంతుడిది. పనికివచ్చేవాళ్ళు ఎవరో, పనికిరానివాళ్ళు ఎవరో దేవుడికి తెలియకుండా ఉందా? ఆ గొడవ నీకెందుకు? వాళ్ళ గుణాలు గొడవ, వాళ్ళ రూపాల గొడవ ఈ గొడవలన్నిటినీ మాయ కల్పించింది. ఆ రూపాలు అబద్ధం, ఆ గుణాలు అబద్ధం. ఆ మాయ గొడవలో నువ్వు పడకు. ఈ రూపాలకి అతీతంగా, ఈ గుణాలకి అతీతంగా అందరి హృదయాలలో నేను ఉన్నాను. నువ్వు నన్నే చూసుకుంటూ సాధ్యమైనంతవరకూ హెచ్చుతగ్గులు లేకుండా సమానంగా ఉండి నువ్వు రోజులు గడుపుకుని వెళ్ళిపో. మద్భక్తింలభతేపరాం అంటే నాపట్ల ఎప్పడూ భక్తి కలిగి ఉండు. ప్రపంచంలో రకరకాల మనుషులు ఉన్నారని మీ బుద్ధిని పాడుచేసుకోకండి. ఎవరి దగ్గర ఎలా ఉండాలో అలా ప్రవర్తించండి. బతకటానికి

యుక్తి కూడా ఉండాలి. మీరు బతికే పద్ధతి కూడా నేర్చుకోండి. రోడ్డుమీద ముళ్ళు ఉంటాయి, ముళ్ళు అన్నీ మీరు ఎక్కడ తియ్యగలరు. చెప్పలు తొడుక్కుని వెళ్ళండి. అందుచేత మీరు లోకాన్ని ఎక్కడ మరమ్మత్తు చేయగలరు. మీ బుద్ధిని మీరు జాగ్రత్తగా కాపాడుకుంటూ మనుష్యుల మధ్యన జీవిస్తూ బయటకు వెళ్ళిపోండి. మీ సంసారానికి తగ్గట్టుగా, మీ కుటుంబం యొక్క పరిస్థితులకు తగ్గట్టుగా జీవించి నెమ్మదిగా భగవంతుడి పాదాలు ఆశ్రయించి ఈ ప్రపంచం అనే మాయలో పడకుండా మిమ్మల్ని మీరు పవిత్రులని చేసుకొని ఆత్మజ్ఞానం సంపాదించుకోండి.

పని చేసినా చెయ్యని వాడితోటి సమానంగా ఎవడు ఉంటాడో వాడు బుద్ధిమంతుడు. వాడు పుణ్యపాపాలని ఈ భూమి మీద వదిలివెళ్ళిపోతాడు. చనిపోవటం, పుట్టటం అబద్ధం అంటారు ఏమిటి? పుట్టటం చూస్తున్నాము, చనిపోవటం చూస్తున్నాం కదా ఇవన్నీ అబద్ధం అంటున్నారు ఏమిటి అని ఒకరు భగవాన్‌ని అడిగారు. అవి అబద్ధమే. మరి నిజం కింద అనిపిస్తోంది అంటే అదే మాయ అన్నారు భగవాన్. మీరు ఎంతకాలం అయితే మాయలో ఉన్నారో అంతకాలం అబద్ధాన్ని నిజం అనుకుంటారు. నేను చెప్పే నిజం మీకు అనుభవంలోనికి వచ్చాక అప్పుడు నిజం నిజంలా మీకు కనిపిస్తుంది. అప్పటి వరకూ అబద్ధాన్ని మీరు నిజం అనుకోక తప్పదు. సాధ్యమైనంతవరకూ మీరు ఇతరుల గొడవలలో కలుగజేసుకోకండి. ఇతరుల గొడవలలో కలుగజేసుకుంటే మీ మనస్సు చిక్కబడిపోతుంది, మీ మనస్సు పల్చబడదు. మనస్సు చిక్కబడేకొలది మీకు జన్మలు పెరిగిపోతాయి. మీ పిల్లలమీద మీకు ప్రేమ ఉన్నప్పటికీ మీరు ఒకోసారి కఠినంగా ఎందుకు ఉంటారు అంటే అలా ఉంటేగాని వాళ్ళు బాగుపడరని కఠినంగా ఉంటారు. అలాగే నీ మనస్సు పట్లకూడా నువ్వు అంత కఠినంగా ఉండాలి. అలా ఉంటేగాని మీ మనస్సు బాగుపడదు. అవసరాన్ని బట్టి కఠినంగా ఉండాలి. మీ మనస్సు పలచబడితేగాని లోపలకు తిరగదు. అందుచేత సాధ్యమైనంతవరకు ఇతరుల వ్యవహారాలలో మీరు కలుగజేసుకోవద్దు. కొన్నిసార్లు మనం మంచికి వెళ్ళినా చెడ్డ ఎదురు వస్తుంది. మీ వ్యవహారాలు ఏమిటో మీరు చూచుకుని మిగతా కాలాన్నంతా పరమేశ్వరుడిని పొందటానికి ప్రయత్నం చేయండి. బుడబుక్కల మాటలతోటి సరిపెట్టకండి. యాక్షనులో చూపించండి, వర్కులో చూపించండి.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 21-08-2011, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు కృష్ణాష్టమి. కృష్ణుడు తల్లి గర్భంలోనుండి బయటకు రాలేదు, పుట్టిన వాడివలె కనిపించాడు. శ్రీకృష్ణుడు శంఖుచక్రాలతో వసుదేవుడికి దర్శనం ఇచ్చాడు. వీడు మన బిడ్డకాదు నారాయణుడని వసుదేవుడికి అర్థం అయ్యింది. వెంటనే భగవంతుడు తన మాయా శక్తితో శిశురూపము ధరించి నన్ను గోకులమునకు తీసుకొనిపోయి అక్కడ యశోద దగ్గర పడుకోబెట్టి యశోదపక్కలో ఉన్న పాపని తీసుకురమ్మని చెప్పాడు. అప్పుడు వసుదేవుడు కృష్ణుడిని బయటకు తీసుకువచ్చాడు. వాన వస్తోంది. వాన నుండి కాపాడుటకు ఆదిశేషుడు తన పడగలను గొడుగువలె విస్తరింపచేసాడు. ప్రవాహములతో పొంగుచున్న యమునా నది వసుదేవునికి దారి ఇచ్చింది. వసుదేవుడు కృష్ణుడిని యశోదపక్కలో పడుకోబెట్టి ఆ పాపను తీసుకొనివచ్చి దేవకీదేవి పక్కలో పడుకోబెట్టాడు. ఇది వసుదేవుడికి తప్పించి ఎవరికీ తెలియకుండా పరమాత్మ మాయచేసాడు. యశోద దగ్గర ఉన్న పాప దుర్గ యొక్క అవతారం. దేవకీదేవికి జన్మించినది విష్ణువుయొక్క అవతారం. దేవకీదేవికి పాప పుట్టిందని కంసుడికి తెలియపరుస్తారు. దేవకీదేవికి పుట్టిన పిల్లలందరినీ కంసుడు చంపుకుంటూ వస్తాడు. ఇది అష్టమగర్భం. ఆ పాపని పైకి ఎగరేసి కత్తితోటి నరకటానికి చూసాడు కంసుడు. ఆ పాప కిందికి రాకుండా పైకి వెళ్లిపోయింది. నిన్ను నేను చంపను. నిన్ను చంపేవాడు గోకులంలో పెరుగుతున్నాడు అని చెప్పి మాయమైపోయింది.

గోకులంలో కొత్తగా పుట్టిన పిల్లలందరినీ చంపివేయమని కంసుడు రాక్షసులకి చెబుతాడు. గోకులానికి మొదట పూతన అనే రాక్షసిని పంపాడు. పూతన తన రెండు స్థనాలకి విషం పూసుకుని, పాలు ఇచ్చినట్టు ఇచ్చి చంపేద్దామని వచ్చింది. కృష్ణుడిని ఎత్తుకొని ముద్దుపెట్టుకుంది. ఎత్తుకున్న కృష్ణుడికి తన స్థనం ఇచ్చింది. రెండు స్థనాలలో ఉన్న పాలు తాగేసి లోపల రక్తం తాగేస్తాడు, రక్తం తాగేస్తే అది చచ్చిపోయింది. వీడు బాలుడే కదా అనుకుంటారు. వీడు మహావిష్ణువు అని వారికి తెలియదు. గోకులంలోనే కంసుడు పంపిన అనేకమంది రాక్షసుల్ని చంపాడు. గోకులంలో ఉండగా ఆవుల్ని కాసాడు. అక్కడే గోవర్థనగిరి పర్వతం ఎత్తాడు. ఒకసారి కృష్ణుడు మట్టి తింటున్నాడు. వాళ్ళ అమ్మ కొట్టటానికి వచ్చింది. కొట్టటానికి చెయ్యి ఎత్తేటప్పటికి వాడికి భయం వేసినట్టు ఏడుస్తూ నోరు తెరిచాడు. ఆ

నోట్లో తల్లి 14 లోకాలు చూచింది. కృష్ణుడికి వెన్నదొంగ అని పేరు. కృష్ణుడు ఎక్కువ వెన్న తింటాడు. అందుకే కొంతమంది వెన్నపూస నైవేద్యం పెట్టి ఆ వెన్నపూస తింటారు. దాని అర్థం ఏమిటి అంటే వెన్నపూస ఎంత మృదువుగా ఉంటుందో, ఎంత స్వచ్ఛంగా ఉంటుందో మీ మనస్సు అంత మృదువుగా అయితే అప్పడు పరమాత్మ మీ మనస్సుని తినేస్తాడు, మీ అహంకారాన్ని తినేసి ఆయన స్వరూపం మీకు ఇస్తాడు. మీ తెలివితేటలు వలన మీరు సాధన చేసి మోక్షం పొందలేరు.

కృష్ణుడు ప్రేమ స్వరూపుడు, రాముడు ధర్మస్వరూపుడు. కృష్ణుడిని చంపటానికి ఎవరైనా వచ్చినా వాళ్ళు మంచివాళ్ళే అని అనుకుంటే వాళ్ళని చంపేసి మోక్షం ఇస్తాడు. వాడు కృష్ణుడు. అక్కడ వాడి హృదయం చూస్తాడు. కొంతమంది నిజంగా మంచివాళ్ళే. కానీ పూర్వజన్మల్లో ఏదో శాపానికి గురి అవుతారు. అలా శాపంతోటి బాధపడేవాళ్ళని, అనేక మందిని శాపవిముక్తులని చేసాడు పరమాత్మ. వాసనాక్షయం అవ్వకుండా ఎవరికీ మోక్షం కలుగదు. ఒకవేళ మీకు ఆత్మజ్ఞానం కొద్దోగొప్పో కలిగినా వాసనాక్షయం అవ్వకపోతే అది నిలబడదు. ఇక్కడ వాసనాక్షయం ముఖ్యం. కృష్ణుడు గోకులంనుంచి బృందావనం వెళ్ళాడు. బృందావనంలో ఉండగా చాలా లీలలు చేశాడు. బలరామకృష్ణులు బృందావనంలో ఉండగా వారిని తీసుకురమ్మని అక్రూరుడిని రాయబారిగా పంపాడు కంసుడు. అక్రూరుడు చాలా మంచివాడు. కొంతమంది బుద్ధిమంతులు కూడా వాళ్ళరాత బాగాలేకపోతే చెడ్డపనులు చేయవలసి వస్తుంది. అక్రూరుడు వచ్చి బలరామకృష్ణులను తీసుకువెళతాను అంటే కృష్ణుడు వెళ్ళడానికి రెడీగానే ఉన్నాడు. కాని గోపికలందరూ అక్రూరుడి రథాన్ని పట్టుకుని వెళ్ళనివ్వరు. అప్పడు గోపికలు అక్రూరుడిని నువ్వు చేసేవన్నీ క్రూరమైన పనులు, నీకు తల్లిదండ్రులు అక్రూరుడని పేరు పెట్టారు, ఆ పేరు తప్పు నువ్వు క్రూరుడవి, నువ్వు బలవంతాన కృష్ణుడిని మధురకు తీసుకుపోతున్నావు అన్నారు. శరీరంతోటి, ఇంద్రియాలతోటి, మనస్సుతోటి అనుబంధంలేని ప్రేమ గోపికలది. గోపికలకి ఉన్న భక్తి ఉద్ధవుడికి కూడా లేదు. కృష్ణుడిని చంపివేయటానికి కంసుడు రాక్షసుల్ని పంపాడు, చాలామంది బలవంతులని పంపాడు అందరినీ కృష్ణుడు చంపేశాడు. ఆశ్చర్యం ఏమిటి అంటే రాముడూ, రావణాసురుడిలాగ కంసుడికీ కృష్ణుడికి పెద్ద యుద్ధం జరగలేదు. కంసుడి దగ్గరకి వెళ్ళాడు. వీడు ఇంతమందిని చంపేసి వస్తున్నాడు నేను తట్టుకోగలనా అనుకుంటాడు కంసుడు. కంసుడు సింహాసనం మీద కూర్చున్నాడు. కృష్ణుడు సింహాసనం దగ్గరకు వెళ్ళి కంసుడి జుట్టు పట్టుకుని కిందకు

లాగాడు, పడిపోయి చచ్చిపోయాడు. కంసుడు యుద్ధంచేయటం వలన చనిపోలేదు, భయంవలన చనిపోయాడు.

నా అనుగ్రహం లేకుండా, నాదయ లేకుండా ఎవ్వరూ నా మాయని జయించలేరు అన్నాడు పరమాత్మ. మీకు కృష్ణుడు దయ ఉంది అనుకోండి. ఎవ్వరికీ రాని కష్టం మీకు వచ్చింది అనుకోండి, వస్తే రానివ్వండి మీ కష్టాన్నంతా సుఖంగా మార్చేయగలడు. వాడు కృష్ణుడు. అందుచేత బాహ్యపరిస్థితులు మీకు అనుకూలంగా ఉన్నా గర్వపడకండి. అదంతా మాయ. నాకు ఎవడి మీద అయితే నిజంగా దయఉందో ఒకోసారి వాడికి డబ్బులేకుండా చేస్తాను. ఎందుకంటే వాళ్ళమీద ఇష్టంలేక కాదు, ఆ డబ్బు మాయలో పడిపోయి నన్ను స్మరించటం మానేస్తారు అని, వాళ్ళ మనస్సుని నావైపు తిప్పకోవటంకోసం చేస్తాను. నా దయలేకుండా నా స్వరూపాన్ని మీరు పొందలేరు అని పరమాత్మ చెప్పాడు. యంత్రం, తంత్రం. యంత్రం అంటే అమ్మవారిని శ్రీచక్ర రూపంలో పూజిస్తారు. రమణాశ్రమంలో ప్రతీ శుక్రవారం, పౌర్ణమిరోజున శ్రీచక్రపూజ చేస్తారు. అది యంత్రం. తంత్రం అంటే మనం గురువు లేకుండా చేయలేము. మనిషికి భోగబుద్ధి ఎక్కువ ఉంటుంది. అంటే సుఖాలు, భోగాలు అనుభవించాలని ఉంటుంది. భోగబుద్ధి ఉన్నవాడికి వాడిని రంపం పెట్టి కోసేసినా ఆత్మజ్ఞానం కలుగదు. ఈ తంత్రం ఏమిచేస్తుంది అంటే భోగబుద్ధిని యోగబుద్ధిగా మారుస్తుంది. అయితే ఇది మనం స్వతంత్రముగా చేసేది కాదు. దానికి గురువు ఉండాలి, ట్రైనింగు ఉండాలి. లోకం మీద మీకు భోగబుద్ధి ఉంటుంది. తంత్ర సాధన వలన యోగ బుద్ధి లోకం లోంచి నీ మనస్సును మళ్ళించి భగవంతుని వైపుకు తిప్పి నీ బుద్ధిని బ్రహ్మాకారం చేస్తుంది. ఈ భోగబుద్ధిని యోగబుద్ధిగా మార్చే శాస్త్రాన్నే తంత్రం అంటారు. ఈ తంత్ర సాధన రామకృష్ణుడు ఒక సంవత్సరం చేశాడు. రామకృష్ణుడు తంత్రసాధన చేసాక ప్రపంచంలో ఉన్న అన్ని ఆకర్షణలు పోయాయి. రామకృష్ణుడు రాత్రుళ్ళు ధ్యానం చేసుకునేవాడు లేకపోతే భగవంతుడి కోసం కన్నీళ్ళు పెట్టుకొనేవాడు. ఒకోసారి శరీర స్పృహ లేకుండా ఆత్మబుద్ధిలోకి వెళ్ళిపోయేవాడు. మనకి భగవంతుడి గురించి చెబుతూఉంటే వినాలని ఉండదు. మనం ప్రపంచం గురించి ఇతరులకు చెప్పటం, ఇతరులు ప్రపంచం గురించి చెబుతూ ఉంటే వినటం తప్ప మనకి ఇంకో పనిలేదు. ప్రతీ మనిషికి భోగబుద్ధి ఉంటుంది. మీరు డబ్బు సంపాదించినా భోగాలు అనుభవించటానికే కదా. మీరు డబ్బు బాగా సంపాదించారు అని ఎవరైనా అంటే సంతోషం

వస్తుంది. అది కూడా ప్రపంచంలో ఒక భాగమే. అది కూడా లోకవాసన. దేహబుద్ధి ఉన్నవాడికి ఇంక అహంకారం పోదు. ఇతరుల చేత మనం గౌరవించబడాలి, ఇతరుల చేత మనం సన్మానాలు పొందాలి అనుకునే బుద్ధి ఉన్నవాడికి అసలు ఈగో పోదు. మీకు సహనం ఉంటే ఎవరైనా మిమ్మల్ని అవమానం చేసినా మీకు ఎర్రచీమ కుట్టినట్టుకూడా ఉండదు. ఇతరులు చేసే గౌరవం మీద మీరు ఎప్పడూ ఆధారపడకూడదు. ఎదుటివాళ్ళు అవమానం చేయటం వలన మనకి వచ్చే నష్టంలేదు. గౌరవం చేయటం వలన వచ్చే లాభంలేదు. అందుచేత మన మీద మనం ఎక్కువ ఆధారపడి ఉండాలి.

ఉద్ధవగీతలో భక్తి ఒక్కటే ఉంటుంది. కానీ భగవద్గీతలో అన్నీ సమన్వయం చేసి చెప్పాడు. కృష్ణుడు శరీరంతో 120 సంవత్సరాలు ఉన్నాడు. కృష్ణుడు స్థితప్రజ్ఞుడు. కృష్ణుడిని పాపాత్ముడు అనుకొన్నా, పుణ్యాత్ముడు అనుకొన్నా, వెన్నదొంగ అనుకొన్నా ఎవరు ఏమి అనుకొన్నా వాడి మనస్సు చలించదు. వాడే స్థితప్రజ్ఞుడు. భగవద్గీత కృష్ణుడు చెప్పాడు, వ్యాసుడు వ్రాసాడు, అర్జునుడు విన్నాడు. అయితే ఆ భగవద్గీత మనం చదువుకుంటే అర్థం అవ్వదు. భగవద్గీత చదివే వాళ్ళకి సహృదయం ఉండాలి, సద్బుద్ధి ఉండాలి, మంచి ప్రవర్తన ఉంటే కానీ భగవద్గీత తన హృదయం మనకి ఇవ్వదు. వేదాల యొక్క సారమే భగవద్గీత. భగవద్గీత అంటే భగవంతుడి చేత చెప్పబడింది.

**ఆపూర్యమాణమచలప్రతిష్ఠమ్ సముద్రమాపః ప్రవిశన్తి యద్వత్**

**తద్వత్కామా యం ప్రవిశన్తి సర్వే సశాన్తి మాప్నోతి న కామకామీ. (2.70)**

స్థితప్రజ్ఞుడు ఎలాగ ఉంటాడు అంటే సముద్రంలాగ లోతుగా, విశాలంగా, నిండుగా ఉంటాడు, చలనం లేకుండా ఉంటాడు. వర్షాకాలంలో నదులు వెళ్ళి సముద్రంలో కలుస్తాయి. సముద్రం ఏమీ కదలదు, మెదలదు. వేసవికాలంలో నదులలో నీళ్ళు ఎండిపోతాయి. నదులు రావటం మానేస్తే ఒక్క అంగుళం కూడా సముద్రం తగ్గదు. అలాగే స్థితప్రజ్ఞుడికి ఎదుటివాడు గౌరవించినా ఏమీ అనిపించదు. ఒకవేళ గౌరవించటం మానేసినా వాడికి ఎర్రచీమ కుట్టినట్టు కూడా ఉండదు. ఎందుచేతనంటే వాడు దేహమాత్రుడు కాదు. మనకి కృష్ణుడికి తేడా ఏమిటి అంటే వాడు దేహంతో ఉన్నా ఈ దేహానికి, మనకి సంబంధం లేదు అని వాడికి తెలుస్తూ ఉంటుంది. మనం దేహంతో ఉన్నప్పడు ఈ దేహమే మనం అనుకుంటాము. ఇది జీవలక్షణం, అది దైవలక్షణం. సముద్రమాపః అంటే కృష్ణుడు ఇక్కడ జ్ఞానిని సముద్రంతోటి పోల్చాడు. రమణమహర్షిగారు కృతిమహోదధౌ అని చెప్పారు. భగవాన్ చెప్పింది ఉప్ప

సముద్రం కాదు, కర్మసముద్రం. అంటే నువ్వు ఏదో పనిచేస్తావు. ఆపని స్వార్థంతోటి చేస్తావు. ఆ పని కలిసివస్తే సంతోషం వస్తుంది. కలిసిరాకపోతే దుఃఖం వస్తుంది. మీకు ఇప్పుడు డబ్బు బాగా ఉందనుకోండి భోగం అనుభవిస్తారు. ఆ డబ్బు ఏకారణంవల్ల అయినా పోతుంది అనుకోండి. పోతేపోయింది మళ్ళీ మనం బాగా డబ్బు సంపాదించాలి అనుకుంటారు. ఎందుచేత ఇదివరకు డబ్బు ఉన్నప్పుడు మీరు ఆభోగాన్ని అనుభవించినప్పుడు అది వాసన కింద పడుతుంది. ఆ వాసన మళ్ళీ మీచేత పనిచేయిస్తుంది. పని చేస్తే మళ్ళీ ఫలితం వస్తుంది. ఆ ఫలితాన్ని మళ్ళీ మీరు అనుభవిస్తారు. మళ్ళీ వాసన కింద పడుతుంది. ఇది కర్మసముద్రం. మనం వయస్సులో ఒక మంచి పని అయినా చేయలేదు, భగవంతుడిని ప్రార్థించుకోలేదు. ఇప్పుడు ముసలితనం వచ్చింది. ఇప్పుడైనా కొన్ని మంచిపనులు చేద్దాము, మోక్షం పొందటానికి సాధన చేసుకొందామంటే, మీరు కర్మఫలితాలు అనుభవించి ఉన్నారు కదా, ఆ కర్మ ఫలితాలు ఎప్పుడైతే మీరు అనుభవిస్తున్నారో అప్పుడు ఏమౌతుంది అంటే మీ మనస్సుని భగవంతుడి వైపుకి గాని, గమ్యంవైపుకి కాని, మోక్షం పొందుదాము అనే సాధన వైపుకి కాని వెళ్ళనివ్వదు. మీరు మోక్షం పొందలేరు. ఈ కర్మసముద్రంలోంచి ఒడ్డుకి వచ్చి మీరు మోక్షానికి వెళ్ళలేరు. అదే కృతి మహోదధౌ.

సైన్సు అభివృద్ధి అయ్యేకొలదీ, టెక్నాలజీ అభివృద్ధి అయ్యేకొలదీ శరీరాలు సుఖపడు తున్నాయి కాని మనస్సులు చిన్నవి అయిపోతున్నాయి, మనస్సు బాగుపడటంలేదు అని కాటన్‌దొర చెప్పాడు. ఇప్పుడు మీ పని బావుంది అనుకోండి మీ మనస్సు మంచిది అని చెప్పగలమా, లేకపోతే మీకు అంగబలం ఉన్నంతమాత్రంచేత మీ మనస్సులు మంచివి అని చెప్పలేము కదా. పూర్వం రెండెడ్ల బండి మీద తిరుగుతూ ఉంటే ఇప్పుడు విమానాల మీద తిరుగుతున్నారు. టెక్నాలజీ అభివృద్ధిలోకి వచ్చింది అయితే మీకు ఏమైనా మనోనిగ్రహం ఉందా? మీ మనస్సు నిర్మలంగా ఉందా? మీ మనస్సులు ఏమైనా బాగుపడ్డాయా? మీ మనస్సుని సైన్సు ఏదైనా బాగుచేస్తోందా? లేదు, మీ శరీరాన్ని సుఖపెడుతుంది కాని మనస్సుని బాగుచేయటంలేదు అని కాటన్‌దొర చెప్పాడు.

వేసవికాలం అయినా, వర్షాకాలం అయినా సముద్రం ఎలాగ సమానంగా ఉంటుందో, నీకు కోరికలు నెరవేరినా, కోరికలు నెరవేరకపోయినా అలా సమానంగా ఉంటే నువ్వు శాంతిని పొందుతావు. కాని ఎవడైతే సముద్రంలాగ ఉండడో వాడికి కోరికలు నెరవేరకపోతే దుఃఖపడతాడు, శాంతిగా ఉండలేడు.

**విహాయకామాన్ యస్సర్వాన్ పుమాంశ్చరతి నిస్పృహః**

**నిర్మమో నిరహంకారః సశాన్తి మధిగచ్ఛతి (2-71)**

దేహంకేంద్రంగా, మనస్సు కేంద్రంగా పెట్టుకొని మీకు కోరికలు వస్తూఉంటే వాటిని మెర్సీలెస్‌గా విడిచిపెట్టాలి. మన చేతిమీద కురుపు వేసిందనుకోండి, మన చేతిమీద కురుపు వేసింది అని శ్రద్ధగా చూసుకుంటామా? చూసుకోము, వెంటనే డాక్టరుదగ్గరకి వెళ్ళి కోయించేసుకుంటాము. అలాగే నీకు ఉపయోగంలేని ఆలోచనలు, నీ దేహం యొక్క ఆరోగ్యం, నీ మనస్సు యొక్క ఆరోగ్యం పాడుచేసే కోరికలు వస్తూఉంటే వాటిని మెర్సీలెస్‌గా విడిచిపెట్టండని పరమాత్మ చెబుతున్నాడు.

నిస్పృహః అంటే నీకు ప్రాపంచిక విషయాలమీద స్పృహ ఉండకూడదు. కొంతమందికి కోరికలు స్థూలంగా లేకపోయినా సూక్ష్మంగా ఉంటాయి. కాళిదాసు ఏమన్నాడంటే మీరు నాకు జున్ను ఇష్టంలేదు అనవచ్చు. దొరికితే తినేస్తారు. అలా కాదు మీకు ఎన్ని ఇంద్రియాలు ఉన్నాయో ఆ ఇంద్రియాలకి సంబంధించిన భోగాలు అన్నీ మీకు ఎదురుగా కనపడాలి. ఆ భోగాలు ఎదురుగుండా కనిపించినప్పటికీ వాటిమీద మీకు ఆకర్షణ కలగకుండా ఉంటే అది వైరాగ్యం. వాడు మాత్రమే ఇంద్రియజాత. సూక్ష్మంగా ఉన్న కోరికలు పైకి కనబడవు. సమయం వచ్చినప్పుడు బయటకు వస్తాయి. అందుచేత సూక్ష్మరూపంలో ఉన్న కోరికలని నువ్వు సాధన చేసి, భగవంతుడి అనుగ్రహాన్ని సంపాదించి వాటిని బయటకు తరమాలి. నిర్మమః అంటే ఎక్కడా మీకు ఎటాచ్‌మెంటు ఉండకూడదు. ఎటాచ్‌మెంటు లేనివాడికి దుఃఖంలేదు, అశాంతిలేదు. ప్రారబ్ధాన్ని బట్టి వాడికి ఏదైనా వచ్చినా వాడికి ఏమీ అనిపించదు. అది పోయినప్పుడు కూడా వాడికి దుఃఖంలేదు. నేను, నాది లేనివాడికి అశాంతిలేదు, దుఃఖం లేదు. నువ్వు ఎంతో ఇష్టపడుతున్న నీ శరీరమే నీది కానప్పుడు ఈ సృష్టిలో ఏది నీది అన్నాడు గౌతమబుద్ధుడు. మీరు పెద్ద సాధన చెయ్యనక్కరలేదు. జపం అక్కరలేదు, ధ్యానం అక్కరలేదు. మీరు ప్రశాంతముగా కూర్చోండి. మీ మనస్సు ఎక్కడికి వెడుతుందో అక్కడ మమకారం ఉన్నట్టు. మీకు మమకారం లేదు అనుకోండి మనస్సును బయటకి కదలమన్నా కదలదు. జపం, ధ్యానం ఎందుకు మనస్సుని నిగ్రహించుకోవటానికే. రోగం ఉన్న వాడికి మందుకాని రోగం లేనివాడికి మందు ఎందుకు? నీకు మమకారం ఉంది కాబట్టి సాధన. మమకారం లేకపోతే సాధనతోటి పనిఏమిటి? నీకు మమకారం లేనప్పుడు నీ మనస్సుని కదలమంటే అది ఎక్కడకు కదులుతుంది. తప్పులు చేయించేది మమకారం, మనుషుల్ని

చంపేది మమకారం. మనం బెంగపెట్టుకోవటం, ఏడవటం, మంచం పట్టటం వీటి అన్నింటికీ కారణం మమకారమే. నీకు మమకారం ఉంటే సహజంగా చావవు. నువ్వు సంతోషంగా చావవు, ఏడుస్తూ దిక్కులేని చావు చస్తావు. పుట్టినప్పడు నువ్వు ఏడుస్తూ పుట్టావు. నీకు చనిపోయే రోజు వచ్చేటప్పటికీ ఆ ఏడుపు పోగొట్టుకొని శాంతిగా, సంతోషంగా చనిపో. అప్పడు నీకు పునర్జన్మలేదు. నువ్వు పుట్టినప్పడు ఏడుపే, చనిపోయేటప్పడూ ఏడుపేనా? మరి నువ్వు ఎందుకు పుట్టావు. నువ్వు ఆ ఏడుపు పోగొట్టుకోవటానికి పుట్టావు కానీ నువ్వు ఏడుపు ఎక్కువగా చేసుకొని చనిపోతున్నావు. నీకు అసలు దైవస్మరణ లేదు. వాడిని చూడాలి వీడిని చూడాలి అంటున్నావు. వాడు నీకు మోక్షం ఇస్తాడా? మీ పిల్లలుకాని, మనవలు కాని చూస్తారని మీరు ఎప్పడూ అనుకోవద్దు, ఎవ్వరూ మిమ్మల్ని చూడరు. మీ జాగ్రత్తలో మీరు ఉండండి. ఇది డార్క్ఏజ్. కృష్ణుడు శరీరం విడిచిపట్టేసాక కలియుగం ప్రారంభమయ్యింది. కలియుగం అంటే చీకటి రోజులు. మీకు వెలుతురు కనబడదు. మనం సాధన చేసుకోవటానికి ప్రయత్నం చేస్తే 90 మంది ఆక్షేపిస్తారు, భగవంతుడిలో ఐక్యమవ్వటానికి మనకి ఎవరు ప్రోత్సాహం ఇవ్వరు. అది యుగలక్షణం. అందుచేత మీరు అమాయకత్వంగా ఉండకండి. ఇప్పడు రోజులు ఎటువంటివి అంటే డబ్బులేని వాళ్ళు బతక గలరు కాని అమాయకత్వంగా ఉన్నవాళ్ళు అసలు బతకలేరు. మిమ్మల్ని చూసే బాధ్యత మాది కదా అంటే నమ్మకండి. ఆ మాటలు పోషించుకోవటానికి వాళ్ళు ఏమైనా శ్రీరాముడా, లక్ష్మణుడా? కాదు మనం మనుషులం. అలా ఉన్నందుకు వాళ్ళని తిట్టనక్కరలేదు. మన జాగ్రత్తలో మనం ఉంటే సరిపోతుంది. మనం ఏ యుగంలో ఉన్నామో ఆ యుగంలో ఉన్నట్టే బతకాలి. ఆత్మజ్ఞానం కలిగితే వాళ్ళ విషయం వేరు. జ్ఞానం కలిగాక బాడీలెస్, మైండ్లెస్, వరల్డ్లెస్ అండ్ గాడ్లెస్ ఆల్సో. ప్రపంచమే లేనివాడికి మిగతా గొడవలు ఏమిటి? వాడికి చూచినా ఒక్కటే, చూడకపోయినా ఒక్కటే.

రాముడి కూడా అరణ్యానికి వెళుతున్నాను అని లక్ష్మణుడు తల్లి సుమిత్రతోటి చెపితే నువ్వు రాముడికి సేవచేయటానికి వెళుతున్నావు. రాముడు సాక్షాత్తు నారాయణుడు. నువ్వు రాముడిని అన్నగారు అనుకోవద్దు, నీ తండ్రి అనుకో. సీతమ్మని వదినగారు అనుకోవద్దు నీ తల్లి అనుకో. రాముడి గురించి మనం అరణ్యంలోకి వచ్చాము అని ఏడవకు. అరణ్యాన్ని అయోధ్యగా చూడు. నువ్వు భగవంతుడికి సేవ చేయటానికి వెళుతున్నావు అని సుమిత్ర లక్ష్మణుడిని ఆశీర్వదిస్తుంది. సుమిత్ర మహాజ్ఞాని.

వేదంలో ఏమని చెప్పాడు అంటే నీకు గౌరవం ఉన్నంతమాత్రంచేత, అధికారం ఉన్నంత మాత్రం చేత, ఐశ్వర్యం ఉన్నంతమాత్రంచేత చదువు ఉన్నంతమాత్రంచేత మీకు మోక్షం రాదు. నువ్వు పరమపవిత్రుడు అయితే నీకు ప్రేమతత్వం ఉంటే నీకు సత్‌కర్మ నిష్కామంగా చేసే స్వభావం ఉంటే ఇవన్నీ నీకు ఉంటే మోక్షం వస్తుంది కాని బయట గొడవల వలన నీకు మోక్షం రాదు అని వేదంలో చెప్పాడు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 02-10-2011, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవంతుడిని స్మరించమంటే, ఆయనను ధ్యానం చేయమంటే మనం చెయ్యము. మనలో అంతర్యామిగా ఉన్న నారాయణుడే ఆ ధ్యానం చేసే బుద్ధిని, అటువంటి మంచి బుద్ధిని మనకు ప్రసాదించాలి. అప్పుడు నారాయణుడిని ధ్యానం చేయగా చేయగా, ఆయన నామాన్ని స్మరించగా స్మరించగా ఆయన స్వరూపం మనకు తెలియబడుతుంది. నారాయణుడు కాలస్వరూపంలో ఉన్నాడు. మనకు చనిపోయేరోజు వస్తే సాధన చెయ్యగలమా, సాధనచెయ్యలేము. అందుచేత ఇప్పడే కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. సాధన చెయ్యకుండా సిద్ధి కలుగదు. మీరు కాలాన్ని పాడుచేసుకొంటున్నారు. డబ్బుపోతే తిరిగి సంపాదించుకోగలం కాని పోయిన కాలాన్ని తిరిగి సంపాదించలేము. యిప్పడు మనకు 70సంవత్సరాలు అనుకోండి మరల 30వ సంవత్సరం రమ్మంటే రాదు. యింక కాలం వెనక్కి వెళ్ళదు అందుచేత కాలాన్ని సద్వినియోగం చేసుకోండి.

ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావటానికి ఒక ఫ్రెంచ్ రచయిత రెండు సూచనలు చెప్పాడు. మీరు సాధన చేసేటప్పడు ఆత్మసాక్షాత్కారం కలిగేవరకూ సాధనలో పడిపోతూ ఉంటారు, అలా ఎన్నిసార్లు పడిపోయినా లేచి మరల సాధన మొదలుపెట్టండి. ఎంత ప్రయత్నం చేసినా ఫెయిలవుతున్నాము ఏమిటి అని మొత్తానికి సాధన మానేయకండి ఎన్నిసార్లు పడిపోతే మరల అన్నిసార్లు లేస్తూఉండండి, సిద్ధి కలిగేవరకూ సాధన విడిచిపెట్టవద్దు. మీ బుద్ధిని మీ జేబులో పెట్టుకోండి ఎవరికీ యిచ్చేయవద్దు. అంటే రోజులు మంచివి కాదు ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో మనకు తెలియదు. మంచిస్వభావం లేనివారు కూడా మంచి వారికింద కనిపిస్తారు. మీకు తెలియక మీ బుద్ధిని వారి జేబులో పెడితే సర్వస్వం కోల్పోతారు. ఎవరైనా ఏదైనా చెపితే వినండి. అందులో మంచి ఉంటే స్వీకరించండి, చెడ్డ ఉంటే

వదిలేయండి. అంతేకాని మొత్తానికి మీ బుద్ధిని ఎవడో జేబులో పెడితే మీరు భౌతికంగాను, ఆధ్యాత్మికంగాను కూడా నష్టపోతారు. వ్యాపారంలో కూడా బహుజాగ్రత్తగా ఉండాలి, మీరు పెట్టుబడి పెట్టేసి నిద్రపోతే ఎవడూ సంపాదించి మీకు ఇవ్వడు. ఇప్పడు రోజులు మంచివి కాదు. కాలాన్నిబట్టి మీరు నడుచుకోవాలి. ఎవరినో నమ్మేసి మీ డబ్బంతా, మీబుద్ధి అంతా వాడి జేబులో పెట్టేస్తే మీరు సర్వం కోల్పేయే పరిస్థితులు వస్తాయి అని చెప్పాడు.

బాహ్యపరిస్థితులు ఎప్పుడూ ఒకే రకంగా ఉండవు. సంసారం అన్నాక హెచ్చుతగ్గులు ఉంటాయి. అందుచేత బాహ్యపరిస్థితుల మీద ఆధారపడవద్దు. బాహ్యపరిస్థితులు మీకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా మీ నిదానంలో మీరు ఉండండి. పిరికితనం వద్దు. ధైర్యంలేనివాడు ఏపనిలోను సక్సెస్ అవ్వలేడు. ధైర్యంలేనివాడు జ్ఞానం సంపాదించలేడు. మనలాగే బుద్ధుడికి సంసారం ఉందికదా. బుద్ధుడికి ఎంత ధైర్యంఉంటే వాడు గృహపరిత్యాగం చేసాడు. పిరికివాడు అటువంటి పనులు చేయగలడా? ఆయన మహాసామ్రాజ్యానికి అధిపతి. ఆయనకు ఎంత ధైర్యం ఉంటే మహాసామ్రాజ్యాన్ని విడిచిపెట్టి బయటకు వచ్చాడు. ఎంతో కొంత ధైర్యం లేకపోతే నువ్వు సత్కర్మ కూడా చేయలేవు. హృదయదౌర్బల్యం అన్నింటికంటే నీచమైనది కాబట్టి నువ్వు దానిని విడిచిపెట్టు. గతించిపోయిన గొడవల గురించి బెంగపెట్టుకోకుండా వర్తమానకాలాన్ని సక్రమంగా ఉపయోగించుకొంటూ మీ కర్తవ్యకర్మను చేసుకోండి. లోపల ఒకరకంగా బయట ఒకరకంగా కాకుండా చేసేపని హృదయపూర్వకంగా చేయండి. సంసారం పోషించుకోవటానికి ఏవో కొన్ని కామ్యకర్మలు చేసుకోవాలి లేకపోతే శరీరయాత్ర గడవదు. అలాగని 365రోజులు కామ్యకర్మలు వద్దు కొన్ని సత్కర్మలు చెయ్యండి. మీ కుటుంబం కోసం కాకుండా సమాజానికి ఉపయోగపడేపనులు కూడా చెయ్యండి. ప్రతీ చిన్నవిషయానికి భయపడితే మీరు ఏపని చెయ్యలేరు. లోకం గొడవ వదిలేయండి. రోడ్డుమీద విమర్శించే వారిని పట్టించుకోవద్దు. మీ క్షేమం కోరేవారు అయితే మీరు పొరపాటు చేసినప్పడు మీ ఇంటికి వచ్చి ఇది పద్ధతి కాదు, ఇలా అయితే మీరు జీవితంలో నష్టపోతారు మీరు ఇలా నడుచుకోండి అని మంచి సలహా చెబుతారు అంతేగాని రోడ్డుమీద విమర్శించరు. అందుచేత బాహ్యపరిస్థితులకు మీ జీవితాన్ని స్వాధీనం చేయకండి.

ఈ రోజు గాంధీగారి జయంతి, లాల్‌బహదూర్‌శాస్త్రి గారి జయంతి. ఇద్దరూ మహాత్ములే. గాంధీగారు అన్నింటికి దూరంగా ఉన్నారు. శాస్త్రిగారు అలాకాదు అన్ని పదవులు చేసాడు ఏమీ అంటుకోకుండా బయటకు వచ్చాడు. ఒకమాటలోగాని, జీవితంలోగాని ఎక్కడా

ఆడంబరంలేదు. ఇద్దరికి తేడా ఏమిటి అంటే గాంధీగారు అసలు భోగాల జోలికి వెళ్ళలేదు. శాస్త్రిగారు అన్ని భోగాలమధ్యన ఉండి వికారం లేకుండా ఉన్నాడు. తిలక్‌గారిలో ఎక్కడా పిరితనం కనబడదు, ఆయన గొప్పవీరుడు. ఆకాశంవచ్చి నామీద పడిపోతే ఆకాశాన్ని కిందపడేసి నా కాళ్ళకింద తొక్కి నా పని నేను చేస్తాను అన్నాడు, వాడు తిలక్. ఆపని వలన మనం ఏదైనా లాభంపొందుతామా అనే సమస్య అక్కడ లేదు. ఆయన బహుముఖ మేధావి. ఆయన జైలులో ఉండగా భార్య చనిపోతే ఇంటికి వెళ్ళి చూసివస్తాను అని గవర్నమెంట్‌కు పిటీషన్ కూడా పెట్టలేదు. అమ్మ చనిపోయింది అని కొడుకులు ఉత్తరం వ్రాస్తే ఇప్పుడు అమ్మ మీకు ఏపని చేసిపెడుతోందో నేను యింటికి వచ్చాక అమ్మ చేసిన పని నేను మీకు చేసిపెడతాను, మీరు బెంగపెట్టుకోవద్దు అని సమాధానం వ్రాసాడట, వాడు తిలక్. కృష్ణుడు చెప్పిన తత్వం ఆయనలో ఉంది. ఈ క్రింద శ్లోకం అంటే ఆయనకు బాగా ఇష్టం, ఇది ఆయన రక్తంలో జీర్ణం చేసుకొన్నారు, ఇంక రాత్రిపగలు ఇదే ఆయనకు మంత్రం.

**కర్మణ్యే వాధికారస్తే మాఫలేషుకధాచన**

**మా కర్మ ఫలహేతుర్భూః మాతే సంఘోస్త్వ కర్మణ**

నువ్వు పనిచేయటానికే పనికివస్తావు. పని విడిచిపెట్టవద్దు. ఇతరులు గుర్తించినా, గుర్తించకపోయినా నువ్వు చేసే పని భగవంతుడు చూస్తున్నాడు కదా. నీకు మోక్షం ఇచ్చేది భగవంతుడే కదా. ఇతరులు నిన్ను మెచ్చుకొన్నా, నిన్ను విమర్శించినా వారి అహంకారమే కదా. ఇతరుల అహంకారం మీద ఆధారపడి ఎంతకాలం బతుకుతావు. కర్మఫలితం మీద నీకు అధికారం లేదు. దాని మీద అధికారం భగవంతుడిది. ఇతరులు మెచ్చుకోవటం లేదు అని నువ్వు చేసే పని మానకు. నువ్వేదో మంచిపని చేసావని అందరూ సంతోషిస్తారు అనుకోకు. మంచిపనులు చేసినా నిన్ను తిట్టేవారు ఉంటారు. గోడలో అడుగున ఉన్న ఇటుకలు కనబడవు. అలాగే ఈ జన్మకు బేస్‌మెంట్ పూర్వజన్మలు, ఆ పూర్వజన్మలు మనకు కనబడవు. ఆ సంఘటన అలా ఎందుకు జరిగింది, ఈ సంఘటన ఇలా ఎందుకు జరిగింది అని మనం అనుకుంటాము. పూర్వజన్మలకు దీనికి సంబంధం ఉంటుంది. ఈ జన్మలో కారణం కనబడకపోవచ్చు. పూర్వజన్మలలో మనం చేసిన పనులకు ఫలితం భగవంతుడు ఎప్పుడు ఎలా ఇస్తాడో మనం చెప్పలేము. ఫలితం నీ చేతిలో లేదు. ఈ శ్లోకం అర్థమైతే మీకు ఇంక దుఃఖం రాదు. కర్మఫలానికి నువ్వు కారణం కావద్దు. కర్మఫలానికి నువ్వు

కారణం అనుకొంటే నీకూడా దుఃఖం వచ్చేస్తుంది. పనిచేసి మర్చిపో. ఈ పని ఇలా అవుతుంది అనుకోలేదు అనుకుంటే అది నీ చేతిలోలేదు. నీ చేతిలో లేనిదానికి నువ్వు కారణం అనుకొంటే దుఃఖం రాక ఏమి చేస్తుంది. కళ్ళులేనివాడికి కళ్ళు ఇచ్చాడు ఏసు. తరువాత వాడు శుభ్రంగా పాడైపోయాడు. ఏమిటి ఇలా పాడైపోయావు అంటే దానికి మీరే కారణం అన్నాడు. నాకు కళ్ళు లేనప్పుడు ఒక ప్రక్కన పడిఉన్నాను. మీరు కళ్ళుఇచ్చాక ఈ లోకంలో ఇన్ని భోగాలు ఉన్నాయి అని తెలిసింది, వాటిని అనుభవించి శుభ్రంగా కుళ్ళిపోయాను. మీరు కళ్ళు ఇవ్వటం వలన ఇదంతా జరిగింది, నేను పాడవ్వటానికి మీరే కారణం అన్నాడు. ఆయన మంచికే ఇచ్చాడు, వాడు పాడైపోతే ఏసు ఏమి చేస్తాడు. వాడి పతనానికి నేనే కారణం అని ఏసు అనుకుంటే ఆయనకీ దుఃఖం వస్తుంది. ఏసు అలా అనుకోలేదు, మన డ్యూటీ మనం చేసాము అనుకున్నాడు. కర్మఫలానికి మీరు కారణం అనుకున్నంతకాలం మీకు వెయ్యికోట్లు ఉన్నా దుఃఖం మిమ్మల్ని వెంటాడుతుంది. కర్మఫలితం భగవంతుడి చేతిలో ఉంది. ఆయన చేతిలో ఉన్న పని గురించి ఆలోంచించకు, దాని గురించి ఆలోచించటం వలన నీకు ప్రయోజనం లేదు, ఆయన జడ్జిమెంట్ నువ్వు అంగీకరించవలసిందే.

శాంతిలేనివాడికి సుఖంలేదు. మనం దారిద్ర్యం అనుభవించగలం గాని మానసికంగా అశాంతి అనుభవించలేము. నువ్వు చేసే మంచి పనులు ఎవరూ గుర్తించటం లేదు, సన్మానాలు చేయటం లేదు అని అసలు పని యందే విరక్తి పెట్టుకోవద్దు. గుర్తింపులు రావటం లేదు అని మీ చేతిలో ఉన్న పని మానేస్తే మీదే దోషం. గుర్తింపులు కోరుకోవటం వలన అహంకారం పెరుగుతుంది. మనల్ని ఎవరూ గుర్తించకపోవటం మంచిది. ఎందుచేతనంటే మనం శాంతిగా ఉండవచ్చు. నీ మనస్సు ఎటు గంతులు వేయమంటే అటు గంతులు వేయకు. నీ మనస్సు కోతి లాంటిది. ఒక రోజు పెట్టమంటుంది, యింకోరోజు కొట్టమంటుంది. అది నిజంకాదు. దేవుడు చెప్పిన వాక్యానికి అనుగుణంగా ప్రవర్తిస్తున్నామా లేదా అనేది చూసుకోవాలి. మనస్సు ఎలా చెపితే అలా ప్రవర్తించకూడదు, శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని జీవించు, ధర్మాన్ని ఆచరించు అదే నిన్ను రక్షిస్తుంది. స్వార్ధంలేకుండా నువ్వు చిన్న మంచిపని చేసినా అది నిన్ను రక్షిస్తుంది.

**బుద్ధి యుక్తోజహాతీహ ఉభేసుకృతదుష్కృతే**

**తస్మాత్ యోగాయ యుజ్యస్వయోగః కర్మసుకౌశలం (2-50)**

నువ్వు కర్మ ఎలా చెయ్యాలి అంటే సమానబుద్ధితో చెయ్యాలి. అంటే మీరు పనిచేస్తూ ఉండాలి, దాని ఫలితం మీకు అంటకూడదు. యోగం అంటే అది, నేర్పు అంటే అది. మీరు సత్కర్మ చేసి ఏదైనా ఆశిస్తారు అనుకోండి, అది అంటుకొంటుంది, అది నేర్పు కాదు. సమాన బుద్ధి కలవాడు, సహృదయం కలవాడు వాడు చేసిన పాపాన్ని, వాడు చేసిన పుణ్యాన్ని ఇక్కడే వదిలేసి శరీరాన్ని విడిచిపెట్టి వెళ్లిపోతాడు. బుద్ధిలేనివాడు పుణ్యపాపాలను మోసుకొని పోతాడు అక్కడ నుండి స్వర్గమో, నరకమో సిద్ధంగా ఉంటాయి. ఈ రెండు మోసుకొని వెళ్లడు అనుకోండి, ఇంక స్వర్గంలేదు, నరకంలేదు, హాయిగా ఉంటాడు అంటే లగేజీ అంతా ఇక్కడే విడిచిపెట్టేయాలి. అలా విడిచిపెట్టటం అంత తేలిక కాదు, దానికి ట్రైనింగ్ అవసరం అంటే పుణ్యపాపాలను ఇక్కడే ఎలా విడిచిపెట్టాలో నేర్చుకో.

అమృతత్వం పొందమని ఉపనిషత్‌లలో చెపుతారు. అమృతత్వం అంటే మృత్యువు రాకముందే మృత్యువుని జయించటం అంటే మృత్యువు వచ్చినా మీకు దానితో సంబంధం ఉండదు, శరీరం చనిపోయేటప్పుడు నేను చనిపోతున్నాను అనే బుద్ధి మీకు కలుగదు, అది అమృతత్వం. మన శరీరాన్ని స్మశానంలో అగ్ని కాల్చేస్తుంది. మీలోపల ఉన్న సద్వస్తువును అగ్ని కాల్చలేదు. అది మీ హృదయంలో ఉంది, అంతటా కూడా ఉంది. మీ హృదయంలో ఉండటమే కాదు అది మీరై ఉన్నారు. మీ హృదయంలో ఉన్న వస్తువును గుర్తిస్తే కాని అంతటా ఉన్నది, ఇది ఒక్కటే అనే అనుభవం మీకు రాదు. ఇప్పుడు మీకు శరీరంతో తాదాత్మ్యం ఉంది, మనస్సుతో తాదాత్మ్యం ఉంది, యిది సహజంగా ఉంది. అలాగ లోపలఉన్న సద్వస్తువుతో మీకు తాదాత్మ్యం వస్తే శరీరం చనిపోయేటప్పుడు నేను చనిపోతున్నాను అని మీకు అనిపించదు ఎందుచేతనంటే చావులేని సద్వస్తువుతో మీకు తాదాత్మ్యం ఉంది కాబట్టి. ఆ స్థితిని ఇప్పడే మీరు పొందండి. అంత తొందరగా మేము పొందలేము అని అంటే కనీసం చనిపోయేరోజుకైనా పొందండి, అప్పడు ఇంక మీకు పునర్జన్మ లేదు అంటే ఇంక మీరు శవాలను మోయనక్కరలేదు. ఆ స్థితిని పొందకుండా మీరు కనుక చనిపోతే మీరు పొందే నష్టం ఇంత అని లెక్కలు కట్టి చెప్పలేము, అపారమైన నష్టాన్ని పొందుతారు. అమృతత్వం పొందాలి అంటే ఇంద్రియాలు, మనస్సు అదుపులో ఉండాలి. మనస్సు, ఇంద్రియాలు ఎవడికైతే అదుపులో ఉండవో వాడి బుద్ధి స్థిరంగా ఉండదు, మాటలో స్థిరత్వం ఉండదు. నోటికి ఎలా వస్తే అలా మాట్లాడతాడు, వాడు అయుక్తుడు. వాడు రోజుకోరకంగా ప్రవర్తిస్తూ ఉంటాడు.

మనం చాలామందిని చూస్తూ ఉంటాము, వారికి పరిస్థితులు అనుకూలంగా లేకపోతే భక్తిని వదిలేస్తారు. మేము చాలాకాలం నుండి భక్తిగా ఉన్నాము, దేవుడు మాకు ఏమి ఉపకారం చేసాడు అంటారు. ఎవడి అంతఃకరణం అయితే దోషపూరితంగా ఉందో వాడికి కనీసం భగవంతుడి మీద విశ్వాసం కూడా కలుగదు. భగవంతుడు అనేవాడు ఉన్నాడు అనేటువంటి భావన స్థిరంగా లేనివాడికి శాంతి కలుగదు, శాంతి లేనివాడికి సుఖంలేదు. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు. మీకు నాకు ఈ పంచభూతాలకు కంట్రోలర్ ఒకడు ఉన్నాడు అని స్థిరమైన బుద్ధి కలిగినవాడికి, వాడి సాధనతో నిమిత్తం లేకుండా దుఃఖం అంతా నశిస్తుంది. మీకు కష్టం వస్తే దేవుడు లేడు అనుకోవటం. మీ కష్టాలకు, సుఖాలకు దేవుడికి సంబంధం ఏమిటి? మీరు చేసిందే మీకు ఎదురు వస్తుందని మీకు తెలియటం లేదు. మీరు మంచి చేస్తే మంచి, చెడ్డ చేస్తే చెడ్డ ఎదురువస్తుంది. దీనికి దేవుడికి ఏమీ సంబంధం లేదు.

అంతఃకరణంలో దోషం లేనప్పుడు భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడని సజీవమైన విశ్వాసం కలుగుతుంది. అప్పుడు మీ మనస్సు పరమాత్మను అంటుకొనిపోతుంది. మీరు పెద్ద పెద్ద సాధనలు చేయలేకపోయినప్పటికి, యోగాభ్యాసాలు లేకపోయినప్పటికీ భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనే నిర్ణయం స్థిరంగా ఉంటే మీకు దుఃఖం పోతుంది. ఎందుచేత నంటే అప్పుడు ఏది వచ్చినా ఆయన ప్రసాదమే అనుకొంటారు. ప్రతీ మనిషికి విషయ-చింతన ఉంటుంది. పూర్వజన్మ సంస్కారములనుబట్టి ఒకోమనిషిని ఒకో విషయం ఆకర్షిస్తుంది. ఏ విషయం మీదకు మన మనస్సు ఎక్కువ వెళుతుందో ఆ పని పూర్వజన్మలలో మనం ఎక్కువగా చేసినట్లు. ఈశ్వరుడి మీద విశ్వాసం పెరుగుతూ ఉంటే మనస్సు ఆ విషయాలతో ఉన్న సంబంధం తెంపుకుని దేవునిపాదాలను అంటిపెట్టుకోవటానికి తిరిగివచ్చేస్తుంది, అదీ మీకు లాభం. మీరు తక్కువ ప్రయత్నం చేసినా భగవంతుని పట్ల విశ్వాసం ఉంటే మనస్సు తొందరగా వెనక్కి వచ్చేస్తుంది. ఈ రోజు ఒక అమ్మాయి నా దగ్గరకు వచ్చింది. నీకు అమెరికాలో సుఖంగా ఉందా, ఇండియాలో సుఖంగా ఉందా అని ఆ అమ్మాయిని అడిగాను. అమెరికాలోను సుఖంలేదు, ఇండియాలోను సుఖం లేదు, మనస్సులోపలకు వెళ్ళినప్పుడు సుఖంగా ఉంది అని చెప్పింది. నాకు ఆశ్చర్యం వేసింది, ఆ అమ్మాయి గురువు అనిపించింది. మనస్సు హృదయాభిముఖంగా వెళితే అక్కడ సుఖం తెలుస్తుంది అని చెప్పింది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| నవంబర్ | 13 | తణుకు, క్షత్రియ కల్యాణ మండపం |
| నవంబర్ | 20 | మురమళ్ళ, శివాలయం |
| నవంబర్ | 25 | గొరగనమూడి, జ్ఞానానంద ఆశ్రమం |
| నవంబర్ | 30 | జిన్నూరు రమణ క్షేత్రం |

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

- Mahabharatha

# రమణ పరంపర

పుణ్యం పండిన ప్రతి వ్యక్తినీ ఆకర్షించారు భగవాన్. అనేకమంది వారి సన్నిధానంలోనే ఉండిపోయారు.

కొంతమంది భగవాన్ మీదా, వారి అహం మూలాన్వేషణ పద్ధతి మీదా పుస్తకాలు వ్రాసారు.

అలా వ్రాసిన తెలుగువారిలో పూజ్యులు కావ్యకంఠ గణపతి మునీంద్రులూ, మునగాల వెంకట్రామయ్యగారు, కృష్ణభిక్షుగారు, సూరినాగమ్మగారు, చలంగారు, గిద్దలూరి లక్ష్మీనరసింహంగారు, జి.వి. సుబ్బరామయ్యగారు, నిమిషకవి పేర్రాజుగారు ముఖ్యులు.

ఇక, భగవాన్ దర్శనానికి నోచుకోకపోయినా, ఏ పూర్వజన్మల పుణ్యఫలం వల్లనో భగవాన్ భక్తులై ఆంధ్రదేశమంతటా రమణగోష్టులు జరుపుతున్న మహానుభావులు మనకు తెలిసి ఉన్నంతవరకు ముగ్గురు ఉన్నారు.

ఒకరు కృష్ణాజిల్లా వాస్తవ్యులు "రమణవాణి" సంపాదకులూ అయిన జి.వి. నాగేశ్వరరావుగారు. వీరి ప్రసంగం ఒక జీవనదిలా, తాపీగా ప్రవహిస్తూన్నట్లు వుండి వీనులకు విందు చేస్తుంది. ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటుంది.

రెండవవారు పశ్చిమగోదావరి జిల్లా జిన్నూరు వాస్తవ్యులైన భూపతిరాజు వెంకట లక్ష్మీనరసింహరాజుగారు (జిన్నూరు నాన్నగారు). వీరు జన్మతః మహావక్త. గొప్ప తత్వవేత్త. వీరి ప్రసంగం మంద్రస్థాయిలో ప్రారంభమై, మధ్యమస్థాయికి చేరుకుని, ఉరుములు మెరుపులతో, సింహగర్జనలతో ఎప్పుడో ఎక్కడో తారాస్థాయిలో ముగుస్తుంది. ప్రసంగ మధ్యంలో వీరిని ఏ దేవతో ఆవేశించినట్టు తోస్తుంది. వీరు శ్రోతల హృదయాల మీద చెరగని ముద్రలు వేస్తారు.

వీరిద్దరూ ఏకధాటిన నాలుగైదు గంటలు ప్రసంగించినా వినేవారికి విసుగు పుట్టదు సరికదా, మరికొంతసేపు చెబితే బాగుండును అని కూడా అనిపిస్తుంది.

మూడవవారు అనంతపురం జిల్లా తాడిపత్రి వాస్తవ్యులూ "భగవాన్ శ్రీ రమణ మహర్షి ఆశ్రమం" వ్యవస్థాపకులూ, అధ్యక్షులూ అయిన వి.వి. బ్రహ్మంగారు. వీరు కూడా చక్కగా ప్రసంగిస్తారు. వీరు భగవాన్‌కు అంకితమైన అదృష్టవంతులు.

(మూలం : ఆత్మదర్శిని ఆధ్యాత్మిక మాసపత్రిక, అక్టోబర్ 2011 సంచిక నుండి సంగ్రహించబడింది)

# నిరంతరం శరీర ధ్యాసే అయితే - చావులేని ఆత్మ అనుభవానికి రాదు

స్వశరీరాన్ని ప్రేమించటం ప్రాణికి సహజధర్మం. ఈ సహజత్వంలోంచే అహంకారం పుంజుకొంటుంది. శరీరానికి అనేక రకాల సుఖాలను అందించాలని తాపత్రయపడుతుంది. శరీరం తాను కాదని తెలుసుకొని సత్యానుభవం పొందాలన్న వారికి కూడా శరీరంపై ప్రేమ కలిగి ఉంటుంది. విషయసుఖాలమీద విముఖత సాధించవచ్చు ఏది సత్యం - ఏది అసత్యం అనే ఎరుక ఉండవచ్చు కాని ధ్యానంలోకి వెళ్లలేరు రేఖామాత్రంగా శరీరం నేను అనే ధ్యాస కారణం. యవ్వనానికి ముసలితనం ధర్మం. శరీరానికి వ్యాధి ధర్మం. జీవితానికి మృత్యువు ధర్మం. చివరి రోజుల్లో జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు పనిచెయ్యవు ఇది కూడా శరీర ధర్మం. మనస్సులో పుట్టే ఆశలు కోర్కెలు పరమేశ్వరుడు తీర్చాలని ఆశపడతాము. దురాశతో కోరికలను పెంచుకోకూడదని మన మనస్సుకు నచ్చచెప్పము. ఈశ్వరాభీష్టం ప్రకారం నడుచుకోమని మనం మన మనస్సుకు నచ్చచెప్పము ప్రకృతి రూపాలమీద ఆశక్తి నిజమనుకోవటం వల్ల అలా జరుగుతున్నది. నీవు కాని దాని గొడవలను ఆలోచిస్తే ఎన్ని తలంపులు, ఎన్ని గొడవలు అలాగే ఉంటే మనం అయ్యేది ఆత్మకాదు శరీరంగానే మిగులుతాము. ఈ క్షుద్రమైన దేహదృష్టి నుంచి మనం ఏ క్షణంలో అతీతమై ఆత్మదృష్టిలో నిలుస్తామో అప్పడే భయ విముక్తులమౌతాము. మనం విషయసుఖాలను అనుభవిస్తూ అదే సమయంలో సత్యాన్ని గ్రహించలేము. ఇంద్రియాల మూలంగా లభించే ఆనందం క్షణికం అని తెలుసుకొంటాము. అగ్నిని నెయ్యితో ఆర్పితే వృద్ధి అవుతుంది. విషయ సుఖాలు అనుభవించే కొలది ఇంకా హెచ్చుతాయి. కొత్తకోరికలు చిగురిస్తాయి. కోరికలను నిరోధిస్తే క్రోధం కలుగుతుంది. గోడకేసి కొట్టిన బంతి తిరిగి మనలనే కొడుతుంది. కోపంతోనూ కోరికతోనూ చిక్కుకున్న వానికి విచక్షణాశక్తి అంతరిస్తుంది. గాంధీజీ "ఆధ్యాత్మికత్వం లేని లౌకిక జీవనం ప్రాణంలేని దేహంతో సమానం" అన్నారు. మహాత్ములు అంటారు "ప్రాణం ఉండగానే శవంలా జీవించటం నేర్చుకొంటే అప్పడే నీకు ప్రభుదర్శనమౌతుంది. యమదూతలు వచ్చిన తరువాత అందరిలా మరణించటం వల్ల ప్రయోజనం లేదు" అని. శరీర బాధను ఇష్టంతో అనుభవిస్తే ఆధ్యాత్మిక స్వస్థతను స్వీకరించటానికి అర్హత లభిస్తుంది. వాటిని భగవంతుడు ఇచ్చిన వరాలుగా భావిస్తూ హుందాగా స్వీకరించినట్లైతే అది తరగని ఆనందానికి దారితీస్తుంది. మనస్సు గుడ్డిది అయితే శరీరాలు అందంగా కనిపిస్తాయి. విషయ వాసనల గుడ్డితనాన్ని గురువు ఆపరేషన్ చేసి స్వచ్ఛతను ప్రసాదిస్తారు.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం**